జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన


NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 112 విశాఖపట్నం | బుధవారం 6 జనవరి 2021 | 8 పేజీలు | వెల : 5.00

## కొచి-మంగళూరు గ్యాస్ పైప్‌లైన్‌ను ప్రారంభించిన మోడీ



**మంగళూరు, జనవరి 5 (ప్రజాపాలన) :** 450 కిమీల కొచి-మంగళూరు ఎల్ఎన్‌జి (లిక్విడ్ నాచురల్ గ్యాస్) పైప్‌లైన్‌ను మంగళవారం ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 'ఒకే దేశంఒకే గ్యాస్ గ్రిడ్' విధానంలో భాగంగా ఈ పైప్‌లైన్ ప్రారంభించినట్లు ప్రధాని తెలిపారు. ధర తక్కువ, సౌకర్యవంతమైన, పర్యావరణ అనుకూలమైన గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ముందుకు వెళ్లడానికి తమ ప్రభుత్వం ఖచ్చితమైన ప్రణాళికను కలిగి ఉందని ఈ సందర్భంగా మోడీ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేరళ గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్, కర్ణాటక గవర్నర్ వజుభాయి వలా, కేరళ సిఎం విజయన్, కర్ణాటక సిఎం యడి యూరప్ప, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర బగ్గ గను ల శాఖ ప్రహ్లాద్ జోష్ పాల్గొన్నారు.

## 13 నుంచి కరోనా వ్యాక్సిన్



**న్యూఢిల్లీ, జనవరి 5 (ప్రజాపాలన) :** భారత్‌లో కరోనా వ్యాక్సిన్ పంపిణీ ఎప్పుడనే విషయంపై ఇప్పటివరకూ నెలకొన్న తర్జనభర్జనకు కేంద్రం ఫుల్‌స్టాప్ పెట్టిం. భారత్‌లో కరోనాను ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ సిద్ధమైందని ప్రజలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పది రోజుల్లో కరోనా వ్యాక్సిన్ ఇచ్చేందుకు సిద్ధమని కేంద్రం ప్రకటించిం. వ్యాక్సిన్ అత్యవసర వినియోగ అనుమతి ఇచ్చిన 10 రోజుల్లో టీకాలను ప్రజలకు ఇవ్వనున్నట్లు తెలిపిం. డ్రైరన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా టీకాల పంపిణీకి కేంద్రం ఇప్పటికే ఏర్పాట్లు చేసిం. జనవరి 13 నుంచి భారత్‌లో కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తాజా ప్రకటనతో స్పష్టమైం. ఆస్ట్రాజెనెకా కోవిషీల్డ్ వ్యాక్సిన్, భారత్ బయోటెక్ కోవ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా గత ఆదివారం అనుమతినిచ్చిన సంగతి తెలిసిందే.నినివ్యాక్సిన్ పంపిణీకి సంబంధించి.. తొలి దశలో భాగంగా హెల్త్ కేర్ వర్కర్లకు, అత్యవసర సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, వయసు పైబడిన వారికి టీకా ఇవ్వాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించిం. వ్యాక్సిన్ తయారీ సంస్థలు త్వరలో ముంబై, చెన్నై, కోల్‌కత్తా, కర్నల్, హర్యానాలోని ప్రభుత్వ మెడికల్ స్టోర్ డిపోలకు విమానాల ద్వారా వ్యాక్సిన్‌ను తరలించనున్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కార్యదర్శి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. అక్కడి నుంచి 37 స్టేట్ వ్యాక్సిన్ స్టోర్లకు తరలించనున్నట్లు తెపారు. అక్కడి నుంచి జిల్లాల్లోని మిగతా 2లో..

# జనవరి 20 వరకు నిర్వహిస్తాం

- ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్లతో సీఎం జగన్ సమావేశం
- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలి
- అవినీతికి పాల్పడటం క్షమించరాని నేరం
- నాణ్యత గల వస్తువులనే వాడండి
- నిర్మాణంలో మన సంతకం కనబడాలి
- స్పందన కార్యక్రమంలో కలెక్టర్లకు సీఎం జగన్ ఆదేశాలు



**అమరావతి, జనవరి 5 (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ప్రారంభం కార్యక్రమం జనవరి 20 వరకూ కొనసాగించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకూ 39 శాతం ఇళ్లస్థలాలు పంపిణీ పూర్తైందని పేర్కొన్నారు. 17వేలకు పైగా కాలనీల్లోని 9,668 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాల పంపిణీ జరిగిందని, మిగిలిన వాటిని కూడా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పాలనలో పారదర్శకతను తారస్థాయికి తీసుకుని వెళ్లామని, ఇక ముందు కూడా దీనిని కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. స్పందన కార్యక్రమంపై సీఎం జగన్ మంగళవారం సమీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా.. ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ప్రారంభ అంశంపై జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ... "ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గొప్ప కార్యక్రమం జరిగింది. ప్రతి కలెక్టర్ పేరు చరిత్రలో నిలిచి పోతుంది. అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. వారి అందరి దీవెనలు మీకు లభిస్తాయి. నాతోపాటు, మీ అందరికీ కూడా ఈ సంతోషం ఉంటుంది. లే అవుట్స్‌లో ఇంటి నిర్మాణాలు కొనసాగించడం ఒక కార్యక్రమమైతే, వాటిలో మౌలిక సదుపాయలు కల్పించడం మరొక కార్యక్రమం. రోడ్లు, కరెంటు, తాగునీరు.. లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలి. కాలనీ పరిమాణాన్ని బట్టి.. ఇతర సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కూడా పెట్టాలి. స్కూళ్లు, అంగన్‌వాడీలు, పార్కులు, గ్రామ, వార్డు సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్ లాంటివి రావాలి. కాలనీ పరిమాణం, జనాభా బట్టి వీటిని ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించి మిగతా 2లో..

## దేశంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం: మంత్రి సురేష్



**విజయవాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** రాష్ట్రంలోని యూనివర్సిటీల బలోపేతానికి ప్రాధాన్యతనిస్తున్నామని విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ప్రతీ యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తొమ్మిది యూనివర్సిటీలకి వైస్ ఛాన్సలర్లని నియమించామని, మూడు యూనివర్సిటీలకి సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యా సంస్థలలో రాజకీయ జోక్యం లేకుండా ఉత్తమ ఫలితాల దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో అర్హులకి పూర్తిస్థాయి ఫీజు రీఎంబర్స్ మెంట్ చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 11 న అమ్మ ఒడి రెండవ విడత కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నాడు నేడులో మూడు విడతలలో 11 వేలకోట్ల రూపాయిలు ఖర్చు చేస్తున్నామని, దేశంలో ఎక్కడాలేని విధంగా హైయర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉన్నత విద్యను బలోపేతం చేస్తున్నాం. నిబంధనలు పాటించని 247 కళాశాలలకి షోకాజ్ నోటీసులు ఇచ్చాం. 48 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించని కళాశాలలపై చర్యలుంటాయి. ఈ నూతన విద్యా సంవత్సరంలో మిగతా 2లో..

## ఏపీ ప్రభుత్వం నన్ను వేధిస్తోంది: ఏబీ వెంకటేశ్వరరావు



**అమరావతి, జనవరి 5 (ప్రజాపాలన) :** ఏపీ ప్రభుత్వం తనపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఐపీఎస్ ఆఫీ సర్స్ అసోసియేషన్‌కు మిగతా 2లో..

## నిష్పక్షపాతంగా రామతీర్థం ఘటన దర్యాప్తు



**విజయనగరం, జనవరి 5 (ప్రజాపాలన) :** ప్రస్తుతం ఏపీలో ఆలయాల దాడులు హాల్ చల్ గా మారాయి. అయితే రామతీర్థం కేసును సీఐడీ దర్యాప్తు చేస్తుంది. ఈరోజు దుండగులు దాడిలో దెబ్బతిన్న మిగతా 2లో..

## కరోనా వ్యాక్సిన్ పంపిణీకి ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధం

**విజయవాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** ఈ నెల 13 నుంచి దేశ వ్యాప్తంగా కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిన నేపథ్యంలో.. కోవి డ్ వ్యాక్సిన్ పంపిణీకి ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రంట్ లైన్‌లో పనిచేస్తున్న 3.7 లక్షల మంది వైద్య సిబ్బందిని గుర్తించింది. తొలి దశలో వీరికి వ్యాక్సిన్ వేయడానికి ఏర్పాట్లు చేసింది. కేంద్రం నుంచి వ్యాక్సిన్ వచ్చే సంఖ్యను బట్టి తొలి విడతలో కానీ, రెండవ విడతలో కానీ ఇతర శాఖల ఫ్రంట్ లైన్ సిబ్బందికి వ్యాక్సినేషన్ అందించనున్నారు. ఫ్రంట్‌లైన్‌లో ఇతర శాఖల సిబ్బంది సంఖ్యను 12 లక్షలుగా గుర్తించింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఫ్రంట్‌లైన్‌తో పాటు దీర్ఘకాలికరోగులు, 50ఏళ్లు దాటిన వారి సంఖ్యను కోటి మందిగా గుర్తించారు. అయితే వైద్య సిబ్బందికి మాత్రమే వ్యాక్సినేషన్ వేయాలంటే 4,5 రోజుల్లో ప్రక్రియ పూర్తికా నుంది. కోటి మందికి మిగతా 2లో..

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

## జనవరి 20 వరకు నిర్వహిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్ఓపీని తయారు చేయాలి. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి అవన్నీపూర్తి కావాలి. ఒక లే అవుట్‌లో పనులు ప్రారంభించిన తర్వాత అవన్నీ పూర్తికావాలి. కాలనీలో పనులు మొదలుపెట్టిన తర్వాత అందులో ఉన్న అన్ని ఇళ్లనూ పూర్తిచేయాలి. ఒకవేళ అదనంగా ఇళ్ల నిర్మాణాన్ని మంజూరు చేయాల్సి వస్తే.. వెంటనే దానికి అనుగుణంగా మంజూరుచేసి కాలనీలో అన్ని ఇళ్లనూ పూర్తిచేసేలా చర్యలు తీసుకుందాం" అని దిశా నిర్దేశం చేశారు.

**ఆహ్లాదకర వాతావరణం ఉండాలి: సీఎం జగన్**

వైఎస్సార్ జగనన్న కాలనీలను మురికివాడలుగా మార్చే పరిస్థితి ఉండకూడదని, ప్రతిచోటా ఆహ్లాదకర వాతావరణం ఉండాలని సీఎం జగన్ అన్నారు. రోడ్లను వినూత్న రీతిలో నిర్మించి, బాగా ఎలివేట్ చేయాలని సూచించారు. వీధి దీపాలు, కరెంటు స్తంభాల ఏర్పాటులో కూడా వినూత్న పద్ధతులను అనుసరించాలని, కాలనీలు కట్టేటప్పుడు కొన్ని కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు శ్రద్ధపెట్టి అన్ని పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. డిజైన్లు, ఇతరత్రా అంశాలపై ఇప్పటికే కొన్ని సూచనలు చేశానని, కలెక్టర్లు దీన్ని సవాల్‌గా తీసుకుని, సమర్థతను నిరూపించుకోవాలని పేర్కొన్నారు.

## పది రోజుల్లో కరోనా వ్యాక్సిన్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాక్సిన్ స్టోర్స్‌కు తరంచి.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ మొదలుపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. కోవిషీల్డ్, కోవ్యాక్సిన్‌లను నిల్వ చేసేందుకు 29,000 కోల్డ్ చైన్ పాయింట్స్‌ను భారత్‌లో సిద్ధం చేసినట్లు ఆరోగ్య కార్యదర్శి చెప్పుకొచ్చారు.

## దేశంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం: మంత్రి సురేష్

(మొదటిపేజీ తరువాయి)

ఆన్ లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాం. ఇంటర్‌లో వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభిస్తాం. అవినీతికి తావులేకుండా యూనివర్సిటీలలో పూర్తిగా కంప్యూటీకరణ చేస్తున్నాం. ఉన్నత విద్యలో ర్యాపిడ్ ఎడ్యుకేషన్ సర్వే నిర్వహిస్తున్నాం. ఈ విద్యాసంవత్సరంలో మూడు కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నాం. అయిదేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుని ప్రారంభిస్తున్నాం. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుని తీసుకువస్తున్నాం. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోసం ఒక ఏడాది పిజికోర్సుని కొత్తగా ప్రవేశపెడుతున్నాం. ఈ ఏడాదిలో ఉన్నత విద్యామండలిని మరింత బలోపేతం చేసి దేశంలో నంబర్ వన్‌గా నిలబడతాం' అని అన్నారు.

## నిష్పక్షపాతంగా రామతీర్థం ఘటన దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

కోదండరామ స్వామి విగ్రహాన్ని సీఐడీ అడిషనల్ డీజీ సినీల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామతీర్థం విగ్రహం దాడి ఉద్దేశ పూర్వకంగానే జరిగింది. పక్కా ప్రణాళికతో పకడ్బందీగా చేసిన చర్య ఇది. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడం, సమాజంలో వివాదాలు సృష్టించడం ఈ చర్యకు ఉద్దేశంగా కనిపిస్తోంది. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతోంది. ఆలయం గురించి సమగ్రంగా తెలిసిన వారే ఈ ఘటనకు పాల్పడినట్టు అనుమానిస్తున్నాం. ఆకతాయిలు చర్యగా భావించడానికి ఎలాంటి ఆధారాలు లేవు. సంఘటన స్థలంలో హెక్సా బ్లేడ్ లభ్యమైంది. స్థానికులు కానీ వారి సహాకారంతో బయటి వ్యక్తులు కానీ విగ్రహంపై దాడికి పాల్పడి ఉండవొచ్చు అని అనుమానం వ్యక్తం చేసారు. సుమారు 400మీటర్ల ఎత్తు,300మెట్లు ఉన్న కొండపై ఆలయానికి చేరుకుని విగ్రహం ధ్వంసం చేయడం సాధారణమైన విషయం కాదు. ప్రాథమిక ఆధారాలు సేకరించాం. డీఐజీ హరికృష్ణ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు అని అన్నారు. చూడాలి మరి ఏం జరుగుతుంది అనేది.

## ఏపీ ప్రభుత్వం నన్ను వేధిస్తోంది : ఏబీ వెంకటేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాశారు. త్వరలోనే క్రిమినల్ కేసుపెట్టి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపి.. మళ్లీ సస్పెన్షన్ ఆర్డర్ విధిం చాలని కుట్ర పన్నుతోందంటూ ఆయన ఆరోపించారు. ఇందుకు తన వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే నెలల తరబడి తనను ఉద్యోగం చేయనీయకుండా, జీతం ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం వేధిస్తోందని వెంకటేశ్వరరావు విమర్శించారు. వెంటనే ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ ఏర్పాటు చేస్తే అన్ని విషయాలు ఆధారాలతో సహా వివరిస్తానని, నిష్పక్షపాత విచారణ జరగాలన్నది తన డిమాండ్ అని వెంకటేశ్వరరావు ఆ లేఖలో వివరించారు.

## కరోనా వ్యాక్సిన్ పంపిణీకి ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాక్సిన్ వేయడానికి రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగుచోట్ల రీజియన్ వ్యాక్సిన్ స్టోరేజ్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చారు. ఒకేసారి కోటి డోసులు భద్రపరిచే విధంగా ఏపీలో ఏర్పాట్లు చేశారు. రెండు డిగ్రీల నుంచి ఎనిమిది డిగ్రీల మధ్యలో వ్యాక్సిన్‌ను భద్రపరచనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 కోట్ల మందికి ఒకేసారి వ్యాక్సిన్ వేయడానికి కూడా వైద్య, ఆరోగ్యశాఖ ఇబ్బంది లేదని తెలిపింది. వ్యాక్సినేషన్ ప్రక్రియకు రాష్ట్ర వ్యాప్తంగా 20వేల బృందాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని 13 జిల్లాలో డ్రై రన్ విజయవంతంగా పూర్తయ్యింది. కోవిడ్ యాప్‌తో పాటు క్షేత్రస్థాయి సమస్యలని డ్రై రన్‌లో అధికారులు పరిశీలించారు. వ్యాక్సినేషన్ టీమ్‌లకి ఇప్పటికే శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయి. కేంద్రం నుంచి వచ్చే వ్యాక్సిన్ డోసులు ఆధారంగా ఎంతమందికి వ్యాక్సినేషన్ వేయాలనేది వైద్య ,ఆరోగ్యశాఖ నిర్ణయించనుంది.

## 'కుట్రలకు పాల్పడితే.. తప్పించుకోలేరు'

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

**అమరావతి, జనవరి 5 (ప్రజాపాలన) :** ప్రభుత్వ పథకాల్లో ఏవైనా లోపాలు దొర్లితే ఎత్తి చూపాల్సిన విపక్షం.. అటువంటివేవీ కనిపించక గుళ్లు, విగ్రహాల ధ్వంసానికి తెగబడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ట్విట్టర్ వేదికగా విపక్షం తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. "కొట్లాటలు పెట్టడం మాని.. మంచి పనులకు సూచనలిస్తే సీఎం స్వీకరిస్తారు. కుట్రలకు పాల్పడితే తప్పించుకోలేరు.. చట్టం వదిలిపెట్టదని" విజయసాయిరెడ్డి హెచ్చరించారు.

# ఫిబ్రవరి 1న 2021 కేంద్ర బడ్జెట్



కరోనా సంక్షోభం తరువాత రానున్న తొలి కేంద్ర బడ్జెట్

ఈ నెల 29 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 5 (ప్రజాపాలన) :** కరోనా మహమ్మారి కారణంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలను రద్దు చేసిన కేంద్రం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుంచి నిర్వహించనుంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ) మంగళవారం సిఫారసు చేసింది. బడ్జెట్ సెషనల్‌లో తొలి దశ సమావేశాలు జనవరి 29 నుండి ఫిబ్రవరి 15 వరకు జరపాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసుల మేరకు ఫిబ్రవరి 1 న కేంద్ర బడ్జెట్ 2021 ను సమర్పించనున్నారు. మార్చి 8 నుంచి ఏప్రిల్ 8 వరకు బడ్జెట్ మలి దశ సమావేశాలు జరుగుతాయి. అలాగే బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ముందు జనవరి 29న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. కోవిడ్-19 మహమ్మారి ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన తరువాత ఎన్‌డీఏ సర్కార్‌కు ఇది తొలిబ బడ్జెట్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సన్నాహకాల్లో తలమునకలై ఉన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమల పెద్దలతో భేటీ అయ్యారు. అలాగే బడ్జెట్‌కు ముందు, ఆర్థిక మంత్రిత్వ శాఖ 'హల్వా వేడుక', బడ్జెట్ పేపర్పత్రాలను ముద్రించే ప్రక్రియ ఉంటుంది. దీంతోపాటు ప్రధాన ఆర్థిక సలహాదారు మార్గదర్శకత్వంలో రూపొందించిన ఆర్థిక సర్వేను బడ్జెట్‌కు ముందు విడుదల చేయడం లాంటి కీలక అంశాలు. కాగా వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో గత 40 రోజులుగా రైతుల నిరసనలు, కోవిడ్-19 వ్యాక్సినేషన్ లాంటి అంశాలు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు చర్చకు రానున్నాయి. మరోవైపు కరోనా నేపథ్యంలో శీతాకాల సమావేశాలను నిర్వహించకుండా, డైరెక్టుగా బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నామని కేంద్రం ప్రకటించడంపై ప్రతిపక్షాలు తప్పుబట్టిన సంగతి తెలిసిందే.

## ఆయనెవరో నాకు తెలీదు.. చంపితే మాకేం వస్తుంది!



**గుంటూరు, జనవరి 5 (ప్రజాపాలన) :** దీక్ష చేస్తున్న వంగవీటి రంగాను నడిరోడ్డుపైన హత్య చేసిన చరిత్ర చంద్రబాబుదని గురజాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. చంద్రబాబు పాలనలో జరిగిన హత్యలన్నీ ఆయన ప్రేరేపించాడని భావించాలా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం శవ రాజకీయాలు చేయటం మంచిది కాదని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంగళవారం జిల్లాలో మాట్లాడుతూ.. తెలుగుదేశం నాయకుడు అంకులు హత్యపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తున్నారని తెలిపారు. అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారని, విచారణలో అసలు విషయాలు బయటపడతాయని పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్? కఠినంగా ఉన్నారని, తెలుగుదేశం నాయకుడు అంకులు హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆయన ఎవరో నాకు తెలియదు, ఇప్పటి వరకు నేను ఆయనను చూడలేదన్నారు. ఆయన్ను చంపితే మాకేం వస్తుందని, ఈ హత్య కేసులో ఎంతటి వారున్నా కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. తెలుగుదేశం నాయకులు శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇంత గొప్పగా ఉంటుందని తెలుగుదేశం నాయకులు ఊహించలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రజల దృష్టి మళ్లించడానికే టీడీపీ శవ రాజకీయాలు, దేవాలయాలపై దాడులు చేపిస్తోందన్నారు. యరపతినేని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాలుగైదు హత్యలు జరిగాయని, అంటే వాటిని ఆయన చేయించాడా అని సూటిగా ప్రశ్నించారు. యరపతినేని నరేంద్ర హత్య కేసులో ముద్దాయి అన్న సంగతి మర్చిపోయాడా అని నిలదీశారు. కాగా గుంటూరు జిల్లాలో టీడీపీ నేత, మాజీ సర్పంచ్ పురంశెట్టి అంకులు ఆదివారం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.


## ప్రభుత్వంపై కక్షతోనే దుశ్చర్య: సీఐడీ

రామతీర్థం బోడుకొండను పరిశీలించిన సీఐడీ అడిషనల్ డీజీ

**విజయనగరం, జనవరి 5 (ప్రజాపాలన) :** రామతీర్థం ఘటనపై సీఐడీ విచారణ చేపట్టింది. రామతీర్థం బోడుకొండను సీఐడీ అడిషనల్ డీజీ సునీల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఘటన జరిగిన విధానం చూస్తుంటే ఎవరో కావాలనే చేసినట్టు ఉందని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం, ప్రభుత్వంపై కక్షతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన రంపం దొరికిందని, అనేక ఆధారాలు సేకరించామని వెల్లడించారు. ఆలయంలో ఉన్న ఆభరణాలు గాని, వస్తువులు గాని దొంగతనం జరగలేదని, రాజకీయాలు చేయడానికే ఘటనకు పాల్పడ్డారన్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందని.. దోషులను త్వరలోనే పట్టుకుంటామని సీఐడీ అడిషనల్ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు.

## 'సీఎం జగన్ విద్యకు పెద్దపీట వేస్తున్నారు'

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



**విజయవాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** పేదలకు ఉచితంగా ఇళ్లు అందిస్తుంటే టీడీపీ దుర్మార్గంగా మాట్లాడుతోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వాంబే కాలనీలోని 60వ డివిజన్‌లో అర్హులైన 2,533 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం జోనల్ కమిషనర్ సమైలా, ఎమ్మార్వో దుర్గా ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. 'అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. సీఎం జగన్ రాష్ట్రంలో పేద ప్రజలకు ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తున్నారు. 386 మందికి టిడ్కో ఇల్లు ఇస్తున్నాం. టీడీపీ ఇళ్ల విషయంలో దుర్మార్గంగా మాట్లాడుతోంది. వాంబే కాలనీలో మినీ బస్టాండ్ వస్తుంది. లే అవుట్‌లు నగరంలో విలీనం చేస్తాం. గతంలో 28 వేల ఇళ్లు ఇచ్చిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కింది. టీడీపీ ప్రజాప్రతినిధులు టిడ్కో విషయంలో ప్రజలను మోసం చేశారు. టీడీపీ నేతలు 12,000 మంది దగ్గర డబ్బులు వసూలు చేశారు. పేదలకు సెంట్ స్థలం ఇస్తున్నాం. నగరంలో 1,600 మందికి ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేస్తున్నాం. సెంట్రల్ నియోజకవర్గంలో కొత్తగా 525 పెన్షన్లు ఇచ్చాము. 45 నుంచి 65 ఏళ్ల లోపు ఉన్న వారికి సీఎం జగన్ చేయూతను ఇచ్చారు. రాష్ట్రంలో సీఎం విద్యకు పెద్దపీట వేస్తున్నారు. వాంబే కాలనీలో రూ. 4 కోట్ల పనులు జరుగుతున్నాయి. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారు. టీడీపీ నేతలు మత రాజకీయాలు చేస్తున్నారు, అది సరికాదు. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు.

## మత్తు పదార్థాల రహిత పట్టణానికి కృషిచేయాలి



**మచిలీపట్నం, జనవరి 5 (ప్రజాపాలన) :** మచిలీపట్నం నియోజకవర్గాన్ని మత్తు పదార్థాల రహిత పట్టణంగా తీర్చిదిద్దటంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కోరారు.

మచిలీపట్నం ఇనస్పైర్ ఎడ్యుకేషనల్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ తతీయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల పేద పిల్లలు, ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడటం దురదష్టకరమన్నారు. మత్తుపదార్థాల భారిన పడి భావి జీవితాన్ని పాడు చేసుకుంటున్నా యువతను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఉందన్నారు. ఇన్‌స్పైర్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ హనుమకొండ అనంత కుమార్ మాట్లాడారు. బీసీ సంఘం నాయకులు గడ్డం రాజు, చిన్నం ట్రస్ట్ ఛైర్మన్ చిన్నం వెంకటరమణ, అమరావతి షెటిల్ ఎగ్జిక్యూటివ్ ఆర్గనైజర్ ఎం.డి.అబ్బాస్, రాష్ట్ర బిఇడి టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చండిక వేణు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సైకాలజిస్ట్ సిహెచ్ వీర్రాజు పాల్గొన్నారు.

## యుపిలో 16,590 మంది హెూంగార్డులపై వేటు



**న్యూఢిల్లీ, జనవరి 5 (ప్రజాపాలన) :** నూతన సంవత్సరవేళ ఉత్తరప్రదేశ్‌లో 16 వేలమందికి పైగా హెూంగార్డ్‌లకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరిస్తూ 16,590 మంది హెూంగార్డ్‌లను తొలగించడానికి యోగి సర్కార్ సిద్ధమైంది. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా యూపీ ప్రభుత్వం ఈ తీరుగా వ్యవహరించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు ఆర్థికమాంద్యం, కరోనా సృష్టించిన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో వేలాది మందిని ఒక్కసారిగా ఉద్యోగాల నుంచి తీసేస్తే, వారిపై ఆధారపడ్డ కుటుంబాలు ఏమైపోతాయని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టాయి. మీరట్ జిల్లాలో జనవరి 1 నుంచి 586 మంది హెూంగార్డ్‌లను విధుల నుంచి తొలగిస్తున్నామని జిల్లా ఎస్పీ ఆదేశాలు చేయటంతో హెూంగార్డ్‌ల తొలగింపు అంశం జాతీయ వార్తలకు ఎక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పోలీస్ ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా హెూంగార్డుల తొలగింపు ఆదేశాలు విడుదల చేయటం చర్చనీయాంశమైంది. తొలగింపు జాబితాలో ఉన్న వేలాది మందికి ఒకేసారి ఆదేశాలు జారీచేస్తే, ఆందోళనకు దిగుతారన్న ఆలోచనతో యోగి ప్రభుత్వం విడతల వారీగా ఆదేశాలు జారీచేసిందని సమాచారం. బరేలి, మీరట్..మొదలైన జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద హెూంగార్డ్‌లు ఆందోళనకు దిగటం వార్తల్లో నిలిచింది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆందోళనకు దిగిన హెూంగార్డులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు మెమోరాండం సమర్పిస్తున్నారు. ప్రభుత్వ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఈ నెల 10 నుంచి నిరాహార దీక్షకు దిగుతామని హెూంగార్డ్‌ల సంఘం నాయకులు ప్రకటించారు.

## తిరుపతి ఎంపీ సీటు మనదే : బీజేపీ



**వెంకటాచలం, జనవరి 5 (ప్రజాపాలన) :** తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపుతో తిరుపతి ఎంపీ సీటు మనదే అవుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రాజు ఆశాభవం వ్యక్తం చేశారు. వెంకటాచలంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎంపీ సీటు కైవసం చేసుకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో అధికార పీఠం బీజేపీ, జనసేలకే దక్కుతుందన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీల బలోపేతాలకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంచి శ్రీనివాసులు యాదవ్, తిరుపతి పార్లమెంటు జనసేన సమన్వయ కమిటీ సభ్యుడు బీ ప్రసాద్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మారారెడ్డి రాధారెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు మంద వెంకటేష్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో విశాఖ వేదికగా పాలన ముహూర్తం ఫిక్స్

## ఏప్రిల్ 13 నుండి విశాఖపట్నం నుండి పరిపాలన సాగించే అవకాశం

## విశాఖకు వెళ్లేందుకు రెడీ అవుతున్న సచివాలయ సిబ్బంది !!

**విజయవాడ, ప్రజాపాలన :** సీఎం జగన్ పరిపాలనా రాజధానిగా విశాఖను ఏర్పాటు చెయ్యాలని దాదాపు సంవత్సరం పైగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు . పట్టు పట్టరాదు ..పట్టి విడువరాదు అన్న చందంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటుకే మొదటి నుండి చాలా పట్టుదలతో ఉన్నారు . అన్నిటికంటే విశాఖ నుండి పాలన సాగించాలని ఆయన చాలా మొండిగా ఉన్నారు. ఏపీ సర్కార్ విశాఖను పరిపాలన రాజధానిగా చేసి, విశాఖ నుండి పరిపాలన సాగించాలని చేస్తున్న ప్రయత్నాలు ఈ ఏడు సాకారం అయ్యే అవకాశం ఉందని బొత్సా సత్యన్నారాయణ అభిప్రాయపడుతున్నారు. ఇక ఇదే విషయంలో సచివాలయ సిబ్బంది కూడా విశాఖ వెళ్లేందుకు రెడీ అంటున్నారు. అధికారిక ఉత్తర్వే తరువాయి అంటున్నారు. 2021లో తెలుగు సంవత్సరాది ఉగాది, ఏప్రిల్ 13 నుండి విశాఖపట్నం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలన పనిచేసే అవకాశం ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే ఏప్రిల్ 13 న వచ్చే తెలుగు నూతన సంవత్సర దినోత్సవం ఉగాది నుండి విశాఖపట్నం రాష్ట్ర పరిపాలనా రాజధానిగా పనిచేయడం ప్రారంభిస్తుందని ఆయన అన్నారు.

**ఏప్రిల్ 13 నుండి చట్టబద్దంగా ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక రాజధానిగా విశాఖ**

విశాఖపట్నంలో విలేకరులతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ ఏప్రిల్ 13 నుండి విశాఖపట్నం చట్టబద్దంగా ఆంధ్రప్రదేశ్ యొక్క కార్యనిర్వాహక రాజధానిగా ఉంటుంది. ఆ తేదీ నుండి ఏపీ పరిపాలనా రాజధానిగా విశాఖ నుండి పనిచేయడానికి మేము సన్నద్ధమవుతున్నాము అని స్పష్టం చేశారు. అప్పటికి అన్ని చట్టపరమైన అడ్డంకులను అధిగమించగలమని మేము ఆశిస్తున్నామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కొత్త భవనాలు నిర్మించే వరకు, విశాఖపట్నంలో కార్యాలయాలకు తగిన భవనాలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందని సచివాలయంలోని ఒక సీనియర్ అధికారి తెలిపారు. మార్చి చివరి నాటికి వారు విశాఖ వెళ్లేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.

**విశాఖ వెళ్ళటానికి సిద్ధం అంటున్న సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కూడా విశాఖపట్నానికి మారడానికి సమాయత్తమవుతోంది. అయితే తమకు ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదని , అధికారిక నోటిఫికేషన్ జారీ చేస్తే విశాఖపట్నం వెళ్లడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు కె వెంకట్రామిరెడ్డి చెప్పారు. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌ను ఏప్రిల్‌లో విశాఖపట్నం మార్చడం సౌకర్యంగా ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఉద్యోగులు తమ పిల్లల విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అమరావతి నుండి కొత్త రాజధానికి వెళ్లడానికి ఇది చాలా అనువైన సమయం అని వారు అభిప్రాయపడుతున్నారు.

**మూడు రాజధానుల ఏర్పాటు లక్ష్యంతో జగన్ సర్కార్**

ప్రస్తుత రాజధాని నగరమైన అమరావతిని శాసన రాజధానిగా ప్రకటించి, న్యాయ రాజధానిగా కర్నూలుకు స్థానం కల్పించి, 2019 డిసెంబర్‌లో జగన్ ప్రభుత్వం విశాఖపట్నంను రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించింది. 2020 జూన్ 16 న, రాష్ట్ర శాసన సభ రెండు బిల్లులను ఆమోదించింది . రాష్ట్రానికి మూడు రాజధాని నగరాలను సృష్టించే లక్ష్యంతో ఏపి వికేంద్రీకరణ మరియు అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి బిల్లు, 2020 , ఎపి కాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రిపీల్) బిల్లును ఆమోదింపజేసి అనుకున్నట్టు మూడు రాజధానుల ఏర్పాటు చెయ్యాలని భావించింది. కానీ ఈ బిల్లులు శాసనమండలి ఆమోదం పొందలేదు .

**రాజధాని మార్పు అడ్డుకోవటానికి చట్టపరమైన చిక్కులు .. తొలగిపోతే రాజధాని మార్పు**

ఆ తర్వాత ప్రభుత్వం శాసనమండలిని రద్దు చేయడం వంటి అనేక గందరగోళాల మధ్య ఇప్పటివరకు విశాఖ పరిపాలన రాజధానిగా ఏర్పాటు ప్రక్రియ జగన్ సర్కార్ రెండడుగులు ముందుకు వేస్తే పది అడుగులు వెనక్కి లాగినట్లు గానే నడుస్తుంది.

2020 జూలై 31వ తేదీన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ రెండు బిల్లులపై ఆమోదముద్ర వేసి మూడు రాజధానులు ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు.

అయితే రాజధాని మార్పు నిలిపివేయడానికి అమరావతి రైతులు 90 కి పైగా వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. రెండు బిల్లులు చట్టపరమైన వివాదాలలో చిక్కుకున్నాయి.

ఇక ఈ వివాదం కోర్టులో ఉన్న కారణంగా రాజధాని మార్పు ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఈ ఏడాది ఉగాదికి చట్టపరమైన చిక్కులన్నీ తొలగిపోతే రాజధాని తరలింపు ప్రక్రియ చేపట్టాలని ఆలోచనలో జగన్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది.

# కష్టంలో ఉండే మనిషికి నేనున్నా అని ధైర్యం చెప్పేవాడే నిజమైన మనిషి

*ఏపీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షైక్ గౌస్*



**గోనెగండ్ల, ప్రజాపాలన న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లలో ఉంటున్న షైక్. గౌస్ సాధారణ విలేకరి అయిన ఎవరికైనా కష్టం వచ్చిందంటే అధైర్య పడకు మీకు నేనున్నా అంటూ ముందుకు వస్తాడు వయస్సు చిన్నదే కానీ మనస్సు పెద్దది అతని వయస్సు 35 కానీ విలేకరిగా దాదాపుగా 16 సంవత్సరాల అనుభవం ఈ యువకుడు %ూావీఖీ% జిల్లా ఉపాధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు చిన్నప్పటినుండి సోషల్ సర్విస్ చెయ్యడం అలవాటుగా చేసుకున్నాడు ఎవరికైనా మాట ఇచ్చాడంటే మాట తప్పడు ఏదైనా చెయ్యాలి అంటే ఎంత కష్టం ఉన్న ముందుకు దూసుకుపోతాడు నాజీవితం అంత కూడా ప్రజలకోసం అని అంటున్నాడు చాలా మంది యువకులు నాకు ఈ దేశం ఏమిచ్చింది అని అంటున్నారు అలాఅనే వారికోసం దేశం ఏమిచ్చింది కాదు ఈ దేశానికి మనం ఏమిచ్చాము అని ఆలోచించాలి అని అన్నారు. ఈ చిన్న వయస్సులోనే చాలా మందికి సహాయం చెయ్యడంలో ముందు ఉంటాడు ఈ మధ్యనే క్యాన్సర్ బాధితునికి అండగా ఉండీ తనవంతు సహాయం చేశాడు కష్టంలో ఉండే మనిషికి సహాయం చేసేవాడే నిజమైన మనిషి అని అన్నారు మనిషికి మనిషికి సహాయం చేసుకోలేకపోతే ఈ జీవితం ఎందుకు అని అన్నారు

# ఎస్ఎఫ్ఐ గోనెగండ్ల మండల నూతన కమిటీ ఎన్నిక



**గోనెగండ్ల, ప్రజాపాలన న్యూస్ :** ఎస్ఎఫ్ఐ గోనెగండ్ల మండల కమిటీని నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐజిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సురేష్,మండల కార్యదర్శి నంది కుమార్, మండల సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు అశోక్ నాయుడు, ఉపేంద్ర, నబి రసూల్, మనోజ్, సతీష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడాలని నూతన కమిటీ పని చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజిత్,అశోక్ నాయుడు,సతీష్,ఖాజా,మనోజ్ లు పాల్గొన్నారు.



# కారంపూడిలో పట్టాల పండగ పంపిణీకి సర్వం సిద్ధం

## తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఓ బాలునాయక్





**కారంపూడి, ప్రజాపాలన :** వైయస్ఆర్ బిజగనన్న కాలనీ పట్టాల పంపిణి కార్యక్రమం ఈ నెల 6వ తేది ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుంది అని తహసీల్దార్ జె. ప్రసాదరావు, ఎంపిడిఓ బాలునాయక్ సోమవారం ప్రజాపాలన కి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టాల పంపిణికి సర్వం సిద్ధం చేసినట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ పిన్నెల్లి. రామకృష్ణారెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు. శ్రీకృష్ణదేవరాయలు వైఎస్సార్సిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి, గురజాల ఆర్డిఓ. పార్థసారధి హాజరై వారి చేతులమీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణి చేస్తారు అని వారు తెలిపారు ఇదిలా ఉండగా ఎంపిడిఓ, తహసీల్దార్ పేదలకు పంపిణి చేసే లేఔట్లను పరిశీలించారు అనంతరం బహిరంగ సభకు ఏర్పాటు చేసే స్టేజి ఏర్పాట్లను కూడా వారు పరిశీలించారు లబ్ధిదారులు అందరు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టాలు పొందాలని తహసీల్దార్, ఎంపిడిఓ కోరారు. గ్రామవాలంటీర్లు ప్రతిఒక్క లబ్ధిదారునికి సమాచారం అందేలా చర్యలు చెప్పట్టలని తహసీల్దార్ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాధంను ఆదేశించారు అలాగే గ్రామంలో ప్రచారసాధనాల ద్వారా పట్టాల పంపిణి గురించి సమాచారం అందించాలని వారు కార్యదర్శిను కోరారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీనాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయాలనీ వారు కోరారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ కీర్తిప్రవంతి, కారంపూడి వీఆర్వో ఎం. కృష్ణప్రాసాద్, పంచాయతీ కార్యదర్శి బొగ్గవరపు. కాశీవిశ్వనాధం, లేఔట్ పనుల కాంట్రాక్టర్ జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు కొమెర. పిచ్చయ్య, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 1 నుంచి రేషన్ సరుకుల డోర్ డెలివరీ



**విజయవాడ, ప్రజాపాలన:** ఆంధ్రప్రదేశ్ లో రేషన్ సరుకుల డోర్ డెలివరీపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలోలో ధాన్యం సేకరణ, రేషన్ డోర్ డెలివరీపై ఆయన మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని, సీఎస్ ఆదిత్యనాథ్ దాస్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, పౌర సరఫరాల కమిషనర్ కోన శశిధర్‌తో ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి రేషన్ సరుకుల డోర్ డెలివరీని ప్రారంభించాలని ఈ సందర్భంగా సీఎం జగన్ ఆదేశించారు. ఈనెల మూడో వారానికి రేషన్ డోర్ డెలివరీ వాహనాలు సిద్ధమవ్వాలని.. అదే రోజు ప్యాకింగ్ బ్యాగులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 15 రోజుల్లో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. సంక్రాంతి కల్లా రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1న ముహూర్తం వచ్చేనెల 1వ తేదీన రేషన్ డోర్ డెలివరీ ప్రారంభిస్తున్నట్లు సీఎం జగన్ తెలిపారు. డోర్ డెలివరీ కోసం వాహనాలను ఈనెల మూడో వారానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాలు అందుబాటులోకి వచ్చిన రోజే 10 కిలోల రైస్ బ్యాగ్స్ ఆవిష్కరిస్తామన్నారు. రేషన్ డోర్ డెలివరీ కోసం ప్రభుత్వం 9260 మొబైల్ యూనిట్లు సిద్ధం చేస్తోంది. అదే సంఖ్యలో అధునాతన వేయింగ్ మిషన్లు కూడా అందుబాటులోకి తెస్తోంది. అలాగే 2.19 కోట్ల నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు సిద్ధం చేస్తోంది. రేషన్ డోర్ డెలివరీ వాహనాలను. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో బీసీలకు 3875, ఎస్సీలకు 2333, ఎస్టీలకు 700, ఈబీసీలకు 1616, ముస్లిం మైనారిటీలకు 567, క్రిస్టియన్ మైనారిటీలకు 85 వాహనాలు కేటాయించారు. లబ్ధిదారులకు 30 శాతం సబ్సిడీ, 60 శాతం బ్యాంకు రుణం, 10 శాతం లబ్ధిదారుడి వాటాతో అందిస్తోంది.

గంట రామ్ కుమార్

# ఈద్గా ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి : మార్కెట్ యార్డ్ చైర్మన్ మన్సూర్





గోనెగండ్ల ప్రజాపాలన న్యూస్ :- మండలకేంద్రమైన గోనెగండ్లలో పవిత్ర స్థలాలను సైతం లెక్క చెయ్యకుండా మద్యం ప్రియులు ఇష్ట రాజ్యాంగ మద్యం త్రాగుతున్నారని గోనెగండ్ల ఈద్గా సమీప భాగంలో కూర్చొని మద్యం త్రాగే వారిపై అధికారులు చర్యలు తీసుకొనేలా కృషిచేయాలని ముస్లిం పెద్దలు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ మన్సూర్ కు తెలిపారు, మంగళవారం రోజు గోనెగండ్ల లోని ఈద్గాను ముస్లిం పెద్దలతో కలిసి ఈద్గా పరిసర ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మన్సూర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్, బక్రీద్ పండుగలను భక్తి శ్రద్ధలతో చేసుకొనే ఈద్గా దగ్గర మద్యం త్రాగడం ఏంటని పవిత్ర స్థలాలను అపవిత్రం చేస్తే చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తంచేశారు, పోలీస్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పవిత్ర స్థలాల్లో మద్యం సేవించే వారు ఎంతటి వారైనా ఎవ్వరు ఉపేక్షించబోరని అన్నారు, ఈ ప్రదేశంలో రోజు రోజుకు మందు బాబుల ఆగడాలు పెరుగుతున్నాయని స్థానిక నివాస మహిళలు తెలిపారు, మధ్యాహ్నం నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం సేవిస్తూ ఈలలు కేకలు వేస్తూ అల్లర్లు చేస్తున్నారని స్థానిక కుటుంబాలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తున్నా మందు బాబులపై ఇప్పటికైనా పోలీసులు సమయాన్ని కేటాయించి కొద్దిరోజుల వరకు పగలు రాత్రి వేళల్లో గస్తి చేపట్టి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ఇక్కడ ప్రశాంతంగా గృహాల్లో ఉండలేమని స్థానికులు వాపోయారు, ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు చికెన్ రాజా, మాబు హుస్సేన్, నబి రసూల్, లాలూసాబ్, కరీం, నబిరసూల్, మరియు స్థానికులు పాల్గొన్నారు,

# విధులలో అలసత్వం చేయరాదు : డాక్టర్ బి బాల కిషోర్ నాయక్



**కారంపూడి, ప్రజాపాలన :** ఆశ డే ను పురస్కరించుకొని కారంపూడి పిహెచ్ సి నందు ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా?? డి బాలకిషోర్ నాయక్ మాట్లాడుతూ విధులలో అలసత్వం వహించరాదని సూచించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందే విధంగా చూడవలసిన బాధ్యత మన అందరిపై వుందని తెలిపారు. జనవరి 17న జరిగే పల్స్ పోలియో పై అవగాహన, అదే విధంగా టిబి వ్యాధి నివారణా చర్యలు, కోవిడ్ , ఆరోగ్య శ్రీ వంటి పలు ఆరోగ్య కార్యక్ర మాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిహెచ్ఓ రామాంజనేయులు, హెచ్ఎస్ డి పట్టాభి, హెచ్ వి సరళ, ఎల్ టి వెంకట లక్ష్మీ, ఆరోగ్య మిత్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 6 జనవరి 2021

# కొత్త సాంకేతికతల సవాళ్లు

ఒక పెద్ద కంపెనీ ఉత్పత్తి చేసే వస్త్రం మీటరు రూ.200కి లభిస్తే చిన్న కంపెనీ ఉత్పత్తిచేసే అదే వస్త్రం ధర విధిగా రూ.250 ఉంటుంది. ఫలితంగా భారతీయ వినియోగదారులు అదనంగా రూ.50 వెచ్చించవలసి ఉంటుంది. ఈ వ్యయాన్ని 'ఉద్యోగితా పన్ను'గా మనం పరిగణించాలి. ఉద్యోగాలతో పాటు ఖరీదైన దేశీయ ఉత్పత్తులు కావాలా లేక ఉద్యోగాలు లేకుండా చౌక విదేశీ సరుకులు కావాలో భారతీయ వినియోగదారులు నిర్ణయించుకోవలసి ఉంది.

ఇరవై ఒకటో శతాబ్ది మూడో దశాబ్దంలోకి ప్రవేశించాం. నిత్య నూతనంగా ప్రభవిస్తున్న సాంకేతికతలను ఎలా నిర్వహించుకోవాలన్నది ఈ దశకంలో మన ముందున్న ఒక అతి పెద్ద సవాల్. ఇటీవల మనదేశంలో డ్రైవర్ అవసరం లేని మెట్రోరైలు ఒకటి ప్రారంభమయింది. మంచిదే. అయితే 2035 సంవత్సరం నాటికి 50 శాతం ఉద్యోగాలను రోబోలు హరించివేయడం ఖాయమని ప్రొఫెసర్ మేథ్యూడి జాన్సన్ (కెనడా) ఘంటాపథంగా చెబుతున్నారు. మరి 2050 నాటికి ఉద్యోగాల విపణి మరింత ఘోరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. సరైన వ్యవస్థీకృత సంస్కరణలు చేపడితే 2050 సంవత్సరం నాటికి మనదేశం రెండో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవిస్తుందని అంతర్జాతీయ ఆర్థిక నిపుణుల అంచనా. చాలా సంవత్సరాలుగా మనదేశంలోని సంఘటిత తరంగంలో ఉద్యోగాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. మరోవైపు లక్షలాది యువజనులు ఏటా కార్మికవిపణి లోకి ప్రవేశిస్తున్నారు. ఇప్పటికే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు సమకూర్చలేక పోగా కొత్త సాంకేతికతలతో ఉన్న ఉద్యోగాలను సైతం హరింపచేస్తున్నాం.

మరోపక్క ఉద్యోగాల సృష్టిలో చిన్న పరిశ్రమలు అగ్రగాములుగా ఉంటున్నాయి. అయితే అవి దేశీయ కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి సంస్థల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

మనదేశంలోని అతి పెద్ద ఔషధ ఉత్పత్తిదారులు చైనా నుంచి ముడి పదార్థాలను, బ్రెజిల్ నుంచి కంటైనర్లను, జర్మనీ నుంచి ఎలక్ట్రానిక్ సామగ్రిని దిగుమతి చేసుకోవడం కద్దు. లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్‌కు మరోదేశం వైపు చూడవలసిన అవసరం మనకు లేదు కదా. ముడి పదార్థాలను అతి తక్కువ ధరకు లభ్యమయ్యే దేశం నుంచి దిగుమతి చేసుకొంటూ తమ ఉత్పత్తులకు అధిక ధర లభించే దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఉత్పత్తిని భారీస్థాయిలో చేపడుతున్నందున దానికి సంబంధించిన వ్యయాలు గణనీయంగా తగ్గుతున్నాయి.

మరి ఔషధ ఉత్పత్తిరంగంలో ఉన్న చిన్న కంపెనీలు పెద్ద సంస్థలతో పోటీ పడలేవు. చిన్న కంపెనీలు తమకు అవసరమైన ముడిపదార్థాలను స్థానికంగానే కొనుగోలు చేసుకోవల్సి ఉంటుంది. అవెంత వ్యయభరితమైనవైనా సరే. ఉత్పత్తి చేసిన ఔషధాలను దేశీయ మార్కెట్‌లోనే తక్కువ ధరకే విధిగా విక్రయించుకోవలసి ఉంటుంది. చిన్న పరిశ్రమలు పెద్ద కంపెనీల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకోలేక దివాలా తీస్తే ఉద్యోగాల సృష్టి నిలిచిపోవడం అనివార్యం. అలాంటప్పుడు ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్న యువజనులకు ఉపాధి కొరవడుతుంది. ఫలితంగా వారిలో చాలామంది అరాచకాలకు పాల్పడే అవకాశముంది.

అధునాతన సాంకేతికత లతో ఉత్పత్తి కార్యకలాపాలు సాగిస్తున్నప్పుడు అటువంటి పరిస్థితులు తప్పవు. కనుకనే చిన్న పరిశ్రమలకు సహాయం సమకూర్చాలని, స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆర్థర్ డి లిటిల్ అనే గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ, బ్యాంక్ ఆఫ్ అమెరికా సూచిస్తున్నాయి.

అయితే ఈ ప్రోత్సాహం, సహాయం వల్ల సత్ఫలితాలు సమకూరుతాయని నేను భావించడం లేదు. నిజానికి మన చిన్న పరిశ్రమలకు 'సహాయం' అందించడానికి బదులు, పెద్ద కంపెనీల నుంచి ఎదురయ్యే పోటీ నుంచి వాటికి 'సంరక్షణ' సమకూర్చాలి. మన యువజనులకు ఉద్యోగాలు సమకూర్చాలంటే ఇలా చేయడం తప్పనిసరి. సహాయం అందించడం వల్ల మార్కెట్‌లో చిన్న, పెద్ద కంపెనీల మధ్య పోటీ కొనసాగుతుంది. కొత్త దశాబ్దంలో దీని వల్ల ప్రయోజనం లేదు. మూడు దశాబ్దాల సరళీకరణ అనుభవాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. మన్మోహన్‌సింగ్ హయాంలో చిన్నపరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సంయుక్తంగా ఏర్పాటు చేయాలని నిపుణుల కమిటీ ఒకటి సూచించింది. ఆచరణలో దాని వల్ల ఎటువంటి ప్రయోజనం నెరవేరలేదు. కనుక చిన్న పరిశ్రమలకు సంరక్షణ సమకూర్చడమే ముఖ్యం.

అయితే ఈ సంరక్షణతోనూ ఒక సమస్య ఉంది. దేశీయ చిన్నపరిశ్రమలకు ప్రభుత్వం సమకూర్చే సంరక్షణ అవి నాసిరకం సరుకులను మాత్రమే ఉత్పత్తి చేసేందుకు దారితీసే అవకాశం ఎంతైనా ఉంది. పైగా వాటి ధరలు అనివార్యంగా భారీగా ఉంటాయి. ఈ నాసిరకం ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌లో మాత్రమే విక్రయిస్తారు. ఇందుకొక ఉదాహరణ అంబాసిడర్ కార్లు. దశాబ్దాల పాటు మన దేశంలోని సంపన్నులకు అవి మినహా మరే అధునాతన కార్లు అందుబాటులో లేకుండా పోయాయి. జపనీస్ కంపెనీ సహకారంతో సంజయ్‌గాంధీ మారుతీ కార్ల కంపెనీని నెలకొల్పిన తరువాతనే పరిస్థితులు మారాయి. ఆర్థిక సంస్కరణలు ప్రారంభయిన తరువాత అవి మరెంత అనూహ్యంగా మారిపోయాయో చెప్పనవసరం లేదు.

'రక్షిత' చిన్నపరిశ్రమల వల్ల దేశ ఆర్థికవ్యవస్థకు సంభవించే నష్టాల నుంచి బయటపడడం ఎలా? రోబోలతో ఉత్పత్తి కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఎగుమతుల కోసం పెద్దఎత్తున ఉత్పత్తి చేయడమే మార్గాంతరం. దీని వల్ల మన పారిశ్రామికవేత్తలు అధునాతన సాంకేతికతలను తప్పక ఉపయోగించుకుంటారు. మనదేశంలో చౌకగా లభ్యమయ్యే శ్రమ శక్తి కూడా వారికి పూర్తిగా అందుబాటులో ఉంటుంది. అయితే ఈ ఉత్పత్తులను పూర్తిగా ఎగుమతుల కోసమే ఉద్దేశించవలసి ఉంటుంది. ఈ విధానం వల్ల మనకు అధునాతన సాంకేతికతలూ సమకూరతాయి, ఎగుమతుల రంగంలో ఉద్యోగాలూ సృష్టి అవుతాయి. ఇక చిన్నపరిశ్రమలకు దేశీయ మార్కెట్‌లో తగు వ్యాపారావకాశాలను కల్పిస్తాయి.

అయితే మనం కొన్ని వాస్తవాలను విస్మరించకూడదు. మన చిన్న ఉత్పత్తిదారులు అనుసరించే 'అసమర్థ' ఉత్పాదక విధానాల వల్ల ఉత్పత్తివ్యయాలు భారీగా ఉంటాయి. ఒక పెద్ద కంపెనీ ఉత్పత్తి చేసే వస్త్రం మీటరు రూ.200కి లభిస్తే చిన్న కంపెనీ ఉత్పత్తిచేసే అదే వస్త్రం ధర విధిగా రూ.250 ఉంటుంది. ఫలితంగా భారతీయ వినియోగదారులు అదనంగా రూ.50 వెచ్చించవలసి ఉంటుంది. ఈ వ్యయాన్ని 'ఉద్యోగితా పన్ను'గా మనం పరిగణించాలి. ఉద్యోగాలతో పాటు ఖరీదైన దేశీయ ఉత్పత్తులు కావాలా లేక ఉద్యోగాలు లేకుండా చౌక విదేశీ సరుకులు కావాలో భారతీయ వినియోగదారులు నిర్ణయించుకోవలసి ఉంది.

మనదేశ జనాభా 130 కోట్లకు పైగా ఉంది. ఈ జనాభా లబ్ధి (డెమోగ్రాఫిక్ డివిడెండ్– పని చేసే వయసు ఉన్న జనాభా పెరగడం వల్ల జరిగే అభివృద్ధి) మనకు ఒక పెద్ద వరంగా పలువురు ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈ జనాభా లబ్ధి జనాభా విపత్తుగా పరిణమిస్తోంది! నోట్లరద్దు, వస్తుసేవల పన్ను, కరోనా మహమ్మారి మన ప్రజలను తీవ్రంగా దెబ్బతీశాయి. మన ఆర్థిక వ్యవస్థకు భారీనష్టాన్ని కలిగించాయి. కూరగాయల విక్రేతల రోజువారీ ఆదాయం రూ.2000 నుంచి రూ.500కి తగ్గిపోయిందని ఉత్తరప్రదేశ్‌లో జిల్లాస్థాయి బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు.

గతంలో ఇద్దరు విక్రేతలు ఉన్నచోట ఇప్పుడు ఇరవై మంది విక్రేతలు ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజల ఆదాయాలలో తగ్గుదల ఇప్పుడు కాకపోయినా సమీప భవిష్యత్తులో ఒక అతిపెద్ద ఆర్థిక ఉపద్రవం కానున్నదనేది స్పష్టం. ఉద్యోగాలను హరించివేసే పెద్ద పరిశ్రమల సాంకేతికతా సమర్థత, ఉద్యోగాలను సృష్టించే చిన్నపరిశ్రమల వాణిజ్య అప్రయోజకత్వం మధ్య అటు అధునాతన సాంకేతికతలు సమకూరడంతో పాటు ఇటు ఉద్యోగాల సృష్టికి దోహదం చేసే ఒక కొత్తమార్గాన్ని కనుగొనవలసిన అవసరమున్నది. 2021–30 దశాబ్దంలో దేశ ఆర్థికవ్యవస్థను సమున్నతస్థాయికి తీసుకువెళ్ళడంలో భారతప్రభుత్వం విధిగా ఎదుర్కోవలసిన సవాల్ ఇది.

# చట్ట రక్షణ... దుష్ట శిక్షణ

చాలెంజ్ చేసి మరీ దళిత వధూవరులను నడి రోడ్ల మీద కుక్కల్ని చంపినట్టు చంపుతుంటే ఈ సమాజం చోద్యం చూస్తూ కూర్చుంటుంది. ప్రణరు హత్య సమయంలో వచ్చిన తీవ్ర స్పందన కూడా ఇప్పుడు సమాజం నుండి రాలేదంటే ఆధిపత్య కులాల మోసం అర్థం అవ్వడంలేదా? వాళ్ళు దళితుల పట్ల చేసే ఏ నేరం గురించయినా సమాజం తీవ్రంగా స్పందిస్తే ఆ నేరాలను ఆపెయ్యడం కాకుండా...అవే నేరాలను తరుచుగా చేసి సదరు సమాజానికి అలవాటు చెయ్యడం వారి అమానుషత్వానికి నిదర్శనం.

ఆడం స్మిత్ హత్య ఒక్క రోజులో జరిగింది కాదు. ఆడం హత్య ఒక్కటే కాదు, మొన్నటి ప్రణరు, నిన్నటి కేరళ అనీష్... కులమదంతో వాళ్ళను హత్య చేసిన మామలు ముందస్తుగానే హత్య చేయబోతున్నట్టు స్పష్టంగా చెప్పారు. హతులు ముందుగానే పోలీసులను రక్షణ కోసం ఆశ్రయించారు. ప్రణరు హత్యకు ముందు పలు సార్లు రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించాడు. "నీ తాళి మూడు నెలలకన్నా ఎక్కువ నీ మెడలో ఉండదు" అని నా భార్యను బెదిరించారు నా అత్తమామలు అంటూ పాలక్కాడ్ అనీష్ పోలీస్ స్టేషన్లో మొర పెట్టుకున్నాడు. ఇవి కేవలం ఉదాహరణలే. ఇలాంటి కేసులు వందల్లో వున్నాయి. 'హత్య చేయబోతున్నాం' అని వాళ్ళు ప్రకటించినా, మమ్మల్ని చంపేస్తాం అంటున్నారని బాధితులు పోలీస్ స్టేషన్లో మొర పెట్టుకున్నా కూడా...ఈ హత్యల్ని నివారించలేకపోవడం దళితుల ప్రాణాలు విలువ లేనివని...ఈ సమాజం మనసా వాచా కర్మణా నమ్ముతుందనడానికి నిదర్శనం. అయితే కులాంతర వివాహాలు ఈ దేశంలో లేవని కాదు. సవర్ణ/ బీసీ కులాల యువతీ యువకులు పై వర్గాలలో కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో వాళ్ళ కుటుంబాల నుండి మొదట్లో చూచాయగా అభ్యంతరం వ్యక్తమయినా అది కొద్ది రోజుల్లోనే సమసిపోవడం జరుగుతుంది కానీ నేర రూపం దాల్చడం మాత్రం అరుదు. అంటే, కులాంతర వివాహం దళితేతర కులాల మధ్య ఎంతో కొంత మేరకు అనుమతించబడుతుందనే చెప్పాలి (దళితులతో కూడా కులాంతర వివాహాలు జరిగిన ఉదాహరణలు వున్నాయి కదా అని అడగడం కేవలం టోకెన్ వాదమే. అలా చేసుకున్న వాళ్ళు పడే కష్టం మిగతా వర్ణాల మధ్య కులాంతర వివాహం చేసుకున్న వారి కంటే వేలరెట్లు అధికం అని గుర్తించాలి. కేవలం హత్యనే వాళ్ళు తప్పించుకున్నారు కానీ, అందుకు సమానమైన అవమానాన్ని/ వెలివేతను కుటుంబాలనుండి వాళ్ళు నిత్యం అనుభవిస్తున్నారు). ఇక్కడ సమస్య కులాంతర వివాహం కాదు, దళితులతో కులాంతర వివాహమే ఈ సమాజానికి అభ్యంతరం. దళిత యువకులు దళితేతర యువతులతో ప్రేమా, పెళ్ళి ద్వారా సంపర్కం చెయ్యడం అనేదే సమస్య. కుటుంబ పరువును కుటుంబ స్త్రీల జననాంగాల పవిత్రత చుట్టూ అల్లుకునే సమాజ విలువల నేపథ్యంలో, మానవ జైవిక అవసరమైన లైంగికతను బీజం – క్షేత్రం స్థాయికి కుదించుకున్న సంఘంలో దళిత బీజం దళితేతర క్షేత్రంలో పడటమే అభ్యంతరకరమైన పరిణామం అయ్యింది. దానికి పరిష్కారం మనుధర్మ శాస్త్రమే. సవర్ణ స్త్రీ క్షేత్రంలో బీజం విడిచే దళితుడిని హతం చెయ్యాలి. పై కులాల అమ్మాయిలను పెళ్ళి చేసుకున్న/ ప్రేమించిన దళిత యువకులను హత్య చెయ్యడం ఇవాళ కొత్తగా చూడటం లేదు కదా సమాజం? కూతుళ్ళను పెళ్ళి చేసుకున్న/ ప్రేమించిన దళితుల్ని చంపెయ్యడం హంతక కులాలకు అన్నిటికన్నా సులువైన, రివాజైన పని అని అందరూ చూస్తూనే వున్నారు కదా? అలాంటప్పుడు నాకు నా భార్య/భర్త కుటుంబం నుండి ప్రాణ భయం వుందని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిన దళిత పిల్లలకు రక్షణ ఇవ్వడం, బెదిరించిన ఆ హంతక కులాల తండ్రులను, బంధువులనూ మూసెయ్యడం అనే చిన్న కదలిక వలన ప్రాణాలు కాపాడవచ్చు కదా? స్త్రీల పట్ల కరమైన నేరాలు చేసిన వారిని శిక్షించడానికి 'నిర్భయ – దిశ' చట్టాలు చేసినట్టే కులాంతర వివాహాలు చేసుకున్న దళితుల పట్ల నేరం చేసే వారిని శిక్షించడానికి 'ప్రణరు' చట్టం రావాలి. 1. కులాంతర వివాహం చేసుకున్న దళిత పిల్లలు తమకు ప్రాణ భయం వుందని ఫిర్యాదు చేసిన వెంటనే అతని భార్య/ భర్త కుటుంబ సభ్యులను అరెస్ట్ చెయ్యాలి. 2. కులాంతర వివాహానికి అడ్డు పడే, బెదిరించే తల్లిదండ్రుల ప్రవర్తన/ కదలికల మీద నిఘా పెట్టాలి. 3. కులాంతర వివాహాలు చేసుకున్న తమ పిల్లల్ని అభ్యంతర పరిచే ఆధిపత్య కులాల తల్లిదండ్రులు ఆ పిల్లల ఇంటికి వెళ్ళడాన్ని కనీసం ఒక సంవత్సరం లేదా అంతకన్నా ఎక్కువ కాలం నిషేధించాలి. 4. కులాంతర వివాహం చేసుకున్న పిల్లల్ని 'నా ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వను' అని చేసే బెదిరింపులకు విరుగుడుగా వీళ్ళకు కూడా మిగతా పిల్లలతోపాటు సమాన ఆస్తిహక్కు విధిగా కలిగించాలి. 5. కులహత్యలకు తెగబడిన వాళ్ళకు బెయిల్ ఇవ్వడం నిషేధించాలి. ఏ కారణం మీద కూడా అరెస్ట్ అయిన తరవాత విచారణ సమయంలో వాళ్ళు బయటకు వచ్చే అవకాశం ఉండకూడదు. కేసు విచారణ పూర్తయి, శిక్ష పడితే అటు నుండి అటే కారాగారానికి వెళ్ళాలి. 6. తమకు ఆధిపత్య కులాల అత్తమామల నుండి ప్రాణ భయం ఉందని ఫిర్యాదు చేసినా కూడా వాళ్ళ హత్యల్ని నివారించలేకపోయిన పోలీస్ స్టేషన్ అధికారుల మీద చర్య తీసుకోవాలి. ఇవి ప్రధానంగా 'ప్రణరు చట్టం'లో వుండాల్సిన విషయాలు. ఒక పక్క బెదిరిస్తూ, మరోపక్క పోలీసులు తూతూ మంత్రం కౌన్సెలింగ్ చేస్తూ ఇంకా ఎంతమంది దళిత వధూవరుల ప్రాణాలు తోడేస్తారు? చాలెంజ్ చేసి మరీ నడి రోడ్ల మీద కుక్కల్ని చంపినట్టు చంపుతుంటే ఈ సమాజం చోద్యం చూస్తూ కూర్చుంటుంది. ప్రణరు హత్య సమయంలో వచ్చిన తీవ్ర స్పందన కూడా ఇప్పుడు సమాజం నుండి రాలేదంటే ఆధిపత్య కులాల మోసం అర్థం అవ్వడంలేదా? వాళ్ళు దళితుల పట్ల చేసే ఏ నేరం గురించయినా సమాజం తీవ్రంగా స్పందిస్తే ఆ నేరాలను ఆపెయ్యడం కాకుండా...అవే నేరాలను తరుచుగా చేసి సదరు సమాజానికి అలవాటు చెయ్యడం వారి అమానుషత్వానికి నిదర్శనం. ప్రణరు హత్యానంతరం అవే రకమైన హత్యలు వరసగా చెయ్యడం ద్వారా సమాజపు ఎమోషన్లని డైల్యూట్ చెయ్యగలిగారు. 'మరో 'పరువు హత్య' అనిసాదా హెడ్‌లైన్లతో కథను ముగించారు.

## చేనేత సృజనాత్మక కళాకారులు

అట్టపెట్టెలో పట్టేటి ..అందమైన  
చీరలనేకం నేసే చేనేత కార్మికులు  
అందమైన పట్టు చీరల సృష్టి కర్తలు  
అందచందాల పట్టు వస్త్రాల అల్లికలు  
ఆడపడచులు మెచ్చే పట్టు వస్త్రాలు  
పట్టు చీరల అంద చందాలు  
మగువల మనస్సు దోచే చేనేత చీరలు  
తమ చెమటలు చిందించేరు  
తమ రక్తం మగ్గాల పై దారపోసేరు  
తమ కర్తవ్యాన్ని నేరవేర్చేరు  
అందమైన వస్త్రాలను మనకందించేరు  
ఆరు గజముల చీరను  
అందముగా తీర్చిదిద్దీ  
కనువిందు చేసే రంగుల నద్దీ  
మగువల మనస్సును దోచేలా చేసి  
అందముగా అంగడిలో అమ్మి  
ఆ పూట కాపూట ఆకలి తీర్చుటకై  
పడేరు చేనేత కార్మికులు కష్టాలు  
ఎంత కష్టపడిన వచ్చును నష్టాలు  
అయినా తప్పదు కదా బతుకు పోరు  
బాటలు

**యం.తారాసింగ్**  
**జిల్లా:నాగర్ కర్నూల్**

# పేద విద్యార్థులకు ఆసరా - జగనన్న అమ్మఒడి పథకం

పేదరికం కారణంగా పిల్లల చదువులు ఆగిపోయే పరిస్థితి రాకూడదని, డబ్బులు లేక ఏ ఒక్క చిన్నారి చదువులకు దూరం కాకూడదన్న సదుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న అమ్మఒడి" అనే పథకాన్ని రూపొందించడం జరిగింది. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తల్లుల గురించి, వారి పిల్లల గురించి ఆలోచించి ఈ పథకం ద్వారా పిల్లలను బడికి పంపే పేద తల్లులకు సంవత్సరానికి 15 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. పిల్లలను బడికి పంపే పేద తల్లులు లేదా గుర్తింపు పొందిన సంరక్షకుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుంది. ఒకటో తరగతి నుండి పన్నెండో తరగతి వరకు గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు మరియు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లోనూ మరియు అన్ని ప్రభుత్వ శాఖల గురుకుల పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ చదివే పేద విద్యార్థులకు మాత్రమే ఈ పథకం వర్తింప చేస్తున్నది. ఈ పథకంలో అర్హులైన విద్యార్థుల తల్లిని లేదా సంరక్షకుని లబ్ధిదారునిగా గుర్తిస్తున్నారు. జగనన్న అమ్మఒడి పథకానికి అర్హత కలిగిన కుటుంబాలకు చెందినవారా, కాదా అని ఆరు అంచెల పరిశీలన ద్వారా అర్హతలను నిర్ణయించి లబ్ధిని చేకూరుస్తున్నారు. ఈ లబ్ధిని పొందడానికి తల్లి లేదా సంరక్షకులు ఆధార్ మరియు బ్యాంకు అకౌంట్ నెంబర్ కలిగి ఉండవలెను. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లులకు ఈ పథకం వర్తిస్తుంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో మరియు ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదువుతున్న అనాథ పిల్లలకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. అర్హత కలిగిన తల్లులు లేదా సంరక్షకులు, కుటుంబ నెలసరి ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో పదివేలు రూపాయలు లోపు ఉన్న వారు మరియు పట్టణ ప్రాంతాలలో పన్నెండు వేలు రూపాయలు లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. పిల్లలు చదువును మధ్యలో నిలిపివేస్తే ఆ విద్యా సంవత్సరానికి వారు ఈ పథకానికి అనర్హులు. కుటుంబ సభ్యులలో ఏ ఒక్కరైనా ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపు పన్ను చెల్లింపుదారు, పెన్షన్ లబ్ధిదారుడు, ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారు ఉన్నట్లైతే వారు ఈ పథకానికి అర్హులు కారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందివ్వబడదు.

2020–21 ఆర్థిక సంవత్సరానికి అమ్మ ఒడి పథకం అమలు ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేసింది. 2021 జనవరి 9 తేదీన అమ్మ ఒడి పథకం ద్వారా 1 నుంచి 12 తరగతి వరకూ చదివే విద్యార్థుల తల్లులకు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్టు వాటిలో స్పష్టం చేసింది. 2019–20 విద్యా సంవత్సరంలో ఈ ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థులందరూ 2020–21 విద్యా సంవత్సరానికి ఈ పథకం అందుకునేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. 2020–21 విద్యా సంవత్సరంలో కొత్తగా ఈ ఆర్థిక సాయాన్ని అందుకునేందుకు ఆర్థిక అర్హతల్ని సూచిస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. కోవిడ్ 19 కారణంగా విద్యార్థులందరికీ 75 శాతం హాజరు నిబంధన నుంచి 2020–21 సంవత్సరానికి మినహాయింపు ఇచ్చారు. అలానే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మరుగుదొడ్డి నిర్వహణ నిధి కింద వెయ్యి రూపాయలను మినహాయించుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పాఠశాల విద్యాశాఖ పేర్కొన్నది. దీంతో ఈ సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.14 వేలను మాత్రమే జమ చేయనుంది ప్రభుత్వం. రూ.1000 జిల్లా మరుగుదొడ్ల నిర్వహణ నిధికి జమవుతాయని ప్రభుత్వం తెలిపింది. 2019–20 విద్యా సంవత్సరానికి పదో తరగతి పూర్తి చేసుకుని ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ కోసం ఎదురుచూస్తోన్న విద్యార్థులు కూడా అమ్మ ఒడికి అర్హులేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇంటర్మీడయట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పదవ తరగతి పూర్తి చేసిన స్కూళ్ళలో వీరి జాబితా అందుబాటులో ఉన్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్, ఐఐఐటీ కోర్సులు ఎంచుకున్న పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు జగనన్న వసతి దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నందున అమ్మ ఒడి వర్తించదని పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. గడచిన ఏడాది అమ్మఒడి లబ్ధికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. ఆకార్డుల స్థానంలో బియ్యం కార్డులు పంపిణీ చేశారు. వాటిలో ఆదాయం వివరాలు పొందుపర్చకపోవడం సమస్యగా మారింది. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేలకు మించి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలకు మించి ఆదాయం ఉంటే అనర్హుల్ని చేస్తున్నారు. గతేడాది ఆర్టీసీ ఉద్యోగులు కార్పోరేషన్‌లో ఉండటంతో వారి పిల్లలకు అమ్మఒడి వర్తింపజేశారు. ఈసారి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి అనర్హులు చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు అమ్మఒడి తొలివిడత లబ్ధి అందింది. వారితో కార్పోరేషన్ ఏర్పాటుచేసి వేతనాలు సీఎంఎఫ్ఎస్ పద్ధతిలో ఇస్తున్నారు. దీంతో వారికి కూడా అనర్హులవుతున్నారు. సచివాలయ ఉద్యోగి కుటుంబంలో ఉన్నా తొలివిడతలో మానవతా ధృక్పథంతో లబ్ధి అందించారు. ఈసారి సచివాలయ ఉద్యోగం ఉంటే ఆ కుటుంబంలోని పిల్లలకు అమ్మఒడి లబ్ధిని తీసేస్తున్నారు. జనవరి నుంచి నవంబరు వరకు ఎన్నో బ్యాంకుల విలీనం జరిగింది. పాత బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ కాకుండా కొత్త బ్యాంకు కోడ్ఇస్తేనే లబ్ధి అందుతుంది. దీనిపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. కుటుంబంలో ఇప్పటికే ఒక పిల్లాడికి అమ్మఒడి లబ్ధి అందుతుంటే రెండో అబ్బాయికి కూడా లబ్ధి అందాలనే ఆలోచనతో గార్డియన్‌ను తెలివిగా కొందరు చేర్చారు. ఇలాంటి వాటికి ఆధార్ మిస్‌మ్యాచ్ అని వస్తుంది. దీంతో మొదటి పిల్లాడికి కూడా లబ్ధి అందని పరిస్థితి ఉంది. విద్యార్థి, తల్లి పేర్లలో తప్పులు దొర్లాయి. జాబితాలోని తప్పులను సరిదిద్దే ప్రక్రియ పూర్తి కావస్తున్నది. రేషన్‌కార్డు తొలగించేందుకు గతంలో ఏడురకాల అంశాల్ని ప్రామాణికంగా తీసుకునేవారు. ఇప్పుడు ఆ ఏడింటితోపాటు మరో నలుగు అదనంగా చేర్చారు. 11 అంశాల్ని నిశితంగా పరిశీలనచేసి అర్హుల జాబితాలో నుంచి అనర్హుల్ని ఏరివేస్తున్నారు. గత ఏడాది అర్హుల జాబితా నందు ఉన్నప్పటికీ కొంత మందికి అమ్మఒడి లబ్ధి అందలేదు. అనేక పర్యాయాలు గ్రామ సచివాలయాల చుట్టూ తిరిగినప్పటికి వారికి అమ్మఒడి లబ్ధి అందలేదు. అయితే ఈ ఏడాది అర్హుల జాబితా తయారీలో ప్రభుత్వం భారీ కసరత్తే చేసింది. అర్హుల, అనర్హుల జాబితాలు ముందుగానే ప్రకటించింది. అర్హులందరికీ లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతో జాబితాల్లో తప్పులను సవరించే అవకాశం కల్పించింది. కావున ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం అర్హుల జాబితా నందలి తల్లులందరికి అమ్మఒడి సాయం అందించాలి.

**– వాసిలి సురేష్**  
**9494615360**

# దేవాలయాలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలి

### చినజీయర్ స్వామి



**విజయవాడ, ప్రజాపాలన :** రాష్ట్రంలో దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఇప్పటికి 50కి పైగా సంఘటనలు జరిగాయి. ఇవాళ సింగరాయకొండపై వెలసిన నరసింహ స్వామి వారి చేతులు ధ్వంసం చేశారు. ఎవరు చేస్తున్నారనేది అప్రస్తుతం.. కానీ పునరావృతం కాకుండా చూడాలి. దాడులకు గురైన ఆలయాలను సందర్శించి, స్థానికుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. ధర్మ జాగరణ చేసే పెద్దలను కలిసి ఏం చేయాలో ఆలోచిస్తాం. రక్షణ కోసం కెమెరాలు పెట్టాలనే ఆదేశాలున్నా అమలు కావడం లేదు. ఆలయాల్లో బాధ్యులుగా ఉండే వ్యవస్థను నిర్మూలించి, పాలనాపరంగా మార్చేశారు. ఇప్పుడు వరుస దాడులతో లోపాలు బయటపడుతున్నాయి. జరిగిన సంఘటనలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవాలి. తర్వాత రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పెద్దల సలహాలు, సూచనలు తీసుకుని ఉపశమన చర్యలు తీసుకోవాలి. ధనుర్మాస ఉత్సవాల అనంతరం 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తాం. ఆలయాల ఉనికికే భంగం కలిగించే స్థితి వచ్చిన నేపథ్యంలో మేం మౌనంగా ఉండలేం. ఇంటెలిజెన్స్ విభాగంతో సమర్థమైన కమిటీ వేసి విచారణ జరపాలి. ఎవరు చేశారో కనిపెట్టి గట్టిగా దండించాలి. వ్యక్తుల మీద ద్వేషం కోసం ఇలా చేయకూడదు. చర్చి, మసీదులపై దాడి జరిగి ఉంటే ప్రపంచ వ్యాప్తంగా స్పందన వచ్చే ది. ఆలయాలపై జరిగితే ఎవరూ అడగలేరనే అభిప్రాయం సరికాదు. ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి సరైన నిర్ణయం ప్రకటించాల్సి ఉన్నా జరగలేదు. మతపరమైన విషయాల్లో రాజకీయ పార్టీలను ముడిపెట్టడం తగదు. ఆధ్యాత్మిక కేంద్రమైన ఆలయాలను అలాగే చూడాలి. మాకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. ఒకరిపై నేరారోపణ చేయాలని అనుకోవడం లేదు. ప్రభుత్వం, సమాజం స్పందించాలి. ప్రయివేటు ఆలయాలు 19 మాత్రమే. మిగిలినవన్నీ దేవదాయ శాఖ పరిధిలో ఉన్న

# కాంట్రాక్ట్ వ్యవసాయంలోకి ప్రవేశించం

### రిలయన్స్ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, జనవరి 5 (ప్రజాపాలన) :** కేంద్రం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలతో కార్పొరేట్ శక్తులు లాభపడతాయన్న విమర్శల నేపథ్యంలో రిలయన్స్ కంపెనీ సోమవారం స్పందించింది. కాంట్రాక్ట్ వ్యవసాయం లేదా కార్పొరేట్ వ్యవసాయంలోకి తాము ప్రవేశించమని రియలన్స్ కీలక ప్రకటన చేసింది. అంతేకాకుండా రైతుల నుంచి వ్యవసాయ భూములను కూడా కొనుగోలు చేసే ఆలోచనకు తమకు లేదని స్పష్టం చేసింది. సోమవారం ఈ మేరకు రిలయన్స్ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. భవిష్యత్తులో కూడా వీటిపై తమ దృష్టి నిలపమని రిలయన్స్ కంపెనీ ఆ ప్రకటనలో పేర్కొంది. రైతుల నుంచి నేరుగా తాము పంటలను కొనుగోలు చేయమని, కేవలం ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం మాత్రమే తమ సరఫరాదారులు కొనుగోలు చేస్తారని తెలిపింది. తక్కువ ధరలకుండే ఏ దీర్ఘకాలిక సేకరణ ఒప్పందంలోకి తాము ప్రవేశించాలని భావించడం లేదని తెలిపింది. "రైతులు కష్టపడి పండించిన పంటలకు లాభదాయకమైన ధర లభించి, వారి కృషికి ప్రతిఫలం లభించాలన్నదే రియలన్స్, దాని సంబంధిత సంస్థల అభిమతం మని అన్నారు. . ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతుకే కట్టుబడి ఉండాలని మా సరఫరాదారులనూ మేం కోరుతున్నాం." అని రియలన్స్ పేర్కొంది. రైతుల నిరసన సందర్భంగా పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో చోటు చేసుకున్న సెల్ టవర్ల ధ్వంసం పై కూడా స్పందించింది. ఈ సెల్ టవర్ల విధ్వంసం వెనుక విదేశీ శక్తులతో పాటు వ్యాపార శత్రువులున్నట్లు తాము భావిస్తున్నామని రియలన్స్ పేర్కొంది.

## మర్రి సుందరరామిరెడ్డికి ఘన నివాళి

**రాజుపాలెం, ప్రజా పాలన :** మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్రి సుందర రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు గౌరవ లావు శ్రీకృష్ణ దేవరాయలు వారి వెంట మర్రి సుబ్బారెడ్డి (లాయర్), మాజీ సర్పంచ్ మర్రి సుబ్బారెడ్డి, తోట లక్ష్మీనారాయణ, మండల వైసీపీ కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, సాతులూరి రామాంజనేయులు, శివారెడ్డి, గ్రామ వాలంటరీస్,బుల్లి బాబు,సాంసన్, వంగూరి రమేష్,గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## జీఓ77ను వెంటనే రద్దు చేయాలి

### బిసి జాయంట్ యాక్షన్ కమిటీ బాపట్ల



**బాపట్ల, ప్రజాపాలన :** జనవరి ఐదు తారీకు మంగళవారం బిసి జాయంట్ యాక్షన్ కమిటీ బాపట్ల వారి కార్యాలయమునందు గొర్ల శ్రీనివాసా రావు అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశములో ఇటీవల ఏపీ ప్రభుత్వము వారు అమలు చేయబోతున్న జీవో77 ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ తీర్మానం ఆమోదించుట జరిగినది ఈ జీఓ అమలు వలన ఏపీ లో అతి తక్కువగా వున్న ప్రభుత్వ కళాశాలలో సీట్లు రాక ప్రైవేటు ఎయిడెడ్ అన్ ఎయిడెడ్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలేజీ లలో చదివే అన్నిర కాల ఎస్సీ ఎస్టీ బిసి ఈబీసీ మైనారిటీస్ తదితర అందరు విద్యా ర్థులు ఉన్నత చదువులు చదివే అవకాశములను కోల్పోతారు కనుక సిఎం జగన్‌పెద్దమనసు తో ఆలోచించి పాదయాత్రలో ఆయన హామీ ఇచ్చినట్లుగా జీఓ77 ను రద్దుచేసి పేద ప్రజలకు న్యాయము చేయవలసినది గా కోరుకొంటున్నట్లు తెలియచేయుట జరిగినదిఅన్ని కళాశాలలో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలి అని డిమాండు చేస్తూ లేని పక్షములో ప్రత్యక్ష కార్యాచరణ రూపిందించు కొని ఆందోళన ఉధృతము చేయుట జరుగును అని తెలియ చేసారు ఈ సమావేశములో చేజర్ల సతీష్ ఏపీ రజక సంఘాల ఐక్య వేదిక కార్య దర్శి ఆవుల వెంకటేశ్వర్లు కమిటీ గౌరవ సలహాదారు, ప్రిన్సిపాల్ శ్రీ భావపురి విద్యా సంస్థలు గండికోట వెంకట రావు మాజీ మునిసిపల్ కౌన్సిలర్ చీమకుర్తి కృష్ణ చైతన్య గుంటూరు జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ కార్యదర్శి షైక్ ఇలియాజ్ ప్రిన్సిపాల్ మోర్ల వెంకటేశ్వర రావు సీనియర్ లెక్చరర్ ధూళిపూడి బసవయ్య సీనియర్ బీసీ నాయకులు రాము సీనియర్ జర్నలిస్ట్ చల్లం శెట్టి వెంకయ్య బిసి నాయకులు సయ్యద్ షౌకత్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గోగులపాటి సాంబశివ రావు బీసీ నాయకులు చల్లా రామయ్య ఏపీ వికలాంగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలను మూసివేయించాలి

:-డీబీహెచ్ పీయస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్



**రొంపిచర్ల. ప్రజాపాలన :** రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామంలోని ఎటువంటి ప్రభుత్వ అనుమతులు పొందకుండా కేరళ మోడల్ స్కూల్ పేరుతో యథేచ్చగా ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్ తో ఆడుకుంటున్న యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డా. గోదా రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం రొంపిచర్ల ఎస్సీ కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ గోగులపాడులో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలో ఎటువంటి కోవిడ్ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తుంటే మండల విద్యాశాఖాధికారి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తక్షణమే తగిన విచారణ జరిపి సంబంధిత ప్రైవేట్ పాఠశాలను మూసివేయించి స్కూల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో పాఠశాల యాజమాన్యంపై మరియు మండల విద్యాశాఖాధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీబీహెచ్ పీయస్ నాయకులు శిఖినం కోటేశ్వరావు,కోటి తదితరులు పాల్గొన్నారు.

## దళిత బహుజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చార్వాక, అట్లూరి విజయ్ కుమార్



**నరసరావుపేట, ప్రజాపాలన :** ఈనెల 9వ తారీఖున దళిత బహుజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, వినుకొండ రోడ్డు లోని నవయుగ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో ఈ సమావేశం జరుగుతున్నట్లు జేఏసీ కన్వీనర్ అట్లూరి విజయ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం నరసరావుపేటలోని అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆఫీస్లో మీడియా సమావేశం నిర్వహించారు. అట్లూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నగారి పేద వర్గాల పైన హత్యలు హత్యచారాలు చేయటం పూర్తిగా భారత రాజ్యాంగాన్ని అధికారం లో ఉన్నటువంటి వారు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక మాట్లాడుతూ దళిత బహుజన సంఘాల నాయకులను ఒక తాటి పైకి తీసుకొని వచ్చి రాష్ట్రంలో ప్రధానమైన రాజకీయ శక్తిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను పూర్తిస్థాయిలో ప్రచారకులుగా తీర్చి దిద్దాలని ఉద్దేశంతో ఈ సమావేశం జరుగుతుందని డాక్టర్ చార్వాక గారు అన్నారు. ఈ సమావేశంలో జెడ్ పి టి వీరస్వామి బాపట్ల పార్లమెంటరీ ఏ ఎం పి ఎస్ సెక్రటరీ, పరిమళ చిరంజీవి జనరల్ సెక్రెటరీ అమ్మ ఫౌండేషన్, కట్టా సునీల్ మాల మహానాడు జిల్లా జనరల్ సెక్రెటరీ, షేక్ షాహీనా, ఇటిక్యాల క్రిస్టఫర్ ఏం పేస్ సెక్రెటరీ మరికొంతమంది పాల్గొన్నారు.

## నకరికల్లులో వైస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు





**నకరికల్లు. ప్రజాపాలన :** మండల కేంద్రమైన నకరికల్లు లో వైయస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ఈ సందర్భంగా ఈ ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన భవనం రాఘవ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నకరికల్లు గ్రామంలో వైఎస్ఆర్ పార్టీ వారు ముగ్గులు పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఈ సంవత్సరం కూడా సంక్రాంతి పండుగలో భాగంగా ఆడవాళ్లకు ఎంతో ఇష్టమైన ముగ్గులను, వేయ డం ద్వారా వారిలోని సృజనాత్మకత,నైపుణ్యాలు బయటకు వస్తాయని సంక్రాంతి పండగ వాతావరణం నెలకొంటుందని ఇలాంటి పోటీలు నిర్వహించి మహిళలు పోటీల్లో ఆత్మధైర్యం పోటీతత్వం సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన సత్తెనపల్లి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో లో షేక్ సలీల్, మొగలి నారాయణ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బెల్లం కొండ గిరి, బద్దుల నాగేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి డాక్టర్ నరసింహారెడ్డి, మరియు ఎంఐఎం పార్టీ నాయకులు షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు

## జగన్‌ను కలిసిన శారదా పీఠం స్వాత్మానందేంద్ర స్వామి

అమరావతి: సీఎం జగన్‌ను శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర స్వామి కలిశారు. హిందూ దేవుళ్ల విగ్రహాలపై దాడి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్వాత్మానందేంద్ర స్వామి మాట్లాడుతూ "స్వరూపానంద స్వామి సూచనలను జగన్‌కు నివేదించా. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీస్ స్టేషన్ల వారీగా ఆలయాలపై దృష్టిపెట్టాలి. ప్రైవేటు ఆలయాల కమిటీలను ప్రభుత్వం సమన్వయం చేసుకోవాలి. సీఎం సానుకూలంగా స్పందించారు." అని అన్నారు.

## ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం నిర్బంధిస్తుంది

### బిజెపి పట్టణ అధ్యక్షులు రండి శెట్టి



**నరసరావుపేట. ప్రజాపాలన :** ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం నిర్బంధిస్తున్న దని బిజెపి పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామ కృష్ణ అన్నారు. మంగళవారం భారతీయజనతాపార్టీ-జనసేన ఉమ్మడిగా పిలుపునిచ్చిన రామతీర్థ ధర్మయాత్రను విజయవంతం చేయాలని పిలువునిచ్చిన నరసరావుపేట భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టిరామకృష్ణ గారిని మరియు పార్టీ నాయకులను. ఈ ప్రభుత్వం పోలీసుల సహాయంతో ఈ ఛలో రామతీర్థం ధర్మయాత్ర ను అడ్డుకోవటానికి నోటీసులు ఇచ్చి గృహానిర్బంధం చేయటం జరిగినది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టిరామకృష్ణ మాట్లాడుతూ నిజాలు నిగ్గుతేల్చాల్సిన పోలీసులు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తూ బీజేపీ నాయకులను అడ్డుకోవడం హేయమైన చర్య అని ప్రతిరోజు రాష్ట్రంలో విగ్రహాల ధ్వంసం, హిందూ దేవాలయాలపై దాడులు,హుండీ అపహరణలు మొదలగు దుశ్చర్యలను అడ్డుకోని పోలీస్ వ్యవస్థ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన యాత్రను నిర్వహించే తమ పార్టీ నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామికమని పోలీస్ శాఖ ప్రభుత్వం చెప్పే పనులు తప్ప తాము చేయవలసిన,తమ కర్తవ్యములైన న్యాయ, ధర్మ వ్యవస్థలను రక్షించటం మరచారని, ఈ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులను ఏర్పరచిన ఛలో రామ తీర్థ ధర్మయాత్ర విజయవంతం అవుతుందని, ధర్మరక్షనకు,ధర్మసంస్థాపణకు ప్రజలే స్వయంగా నడుం బిగించి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

# 'లూయీస్ బ్రెయిలీ అంధుల ఆశా కిరణం'





### "డా.సింగరాజు సాయికృష్ణ"

**నరసరావుపేట, ప్రజాపాలన :** స్థానిక లూథరన్ అంధుల పాఠశాలో లూయిస్ బ్రెయిలీ 212 వ జన్మదిన వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ''డా! సింగరాజు సాయికృష్ణ" గారు మాట్లాడుతూ బ్రెయిన్ లూయిస్ అంధులకు ఆశ జ్యోతి, ఆశా కిరణం లాంటివాడు అని తెలియచేశారు. ఆయన కనుగొన్న బ్రెయిన్ లిపి వల్లనే ఈ రోజున అంధుల చాలా ఉన్నత శిఖరాలని అందుకుంటున్నారు అని మరియు రాబోయే రోజుల్లో సింగరాజు ఫౌండేషన్ ద్వారా అంధులకు ఏటువంటి సహాయ సహకారాలు కావాలి అన్నా కూడా అనన్య హాస్పిటల్ మరియు సింగరాజు ఫౌండేషన్ తరపునా ఏటువంటి సేవ చేయుటానికి అయిన ఏళ్ల వేళలా అందుబాటులో ఉంటాను అని "డా! సింగరాజు సాయికృష్ణ '' మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మరొక ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శేశి భూషణ్, వసుంధర, విజయ మేటీల, శరత్ బాబు, పూర్వ అంధ విద్యార్థులు పాల్గొన్నారు.





# రైతు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

## రొంపిచర్ల మార్కెట్ యార్డులో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి







**రొంపిచర్ల, ప్రజాపాలన :** రైతు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మం గళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లా డుతూ మండలంలోని రైతులందరూ మీ మీ పరిధిలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం నమూనాలను తీసుకెళ్తే అక్కడ మార్కెట్ యార్డ్ సిబ్బంది మీ నమూనాలను పరిశీలించి, వాటి యొక్క తేమ శాతాన్ని నిర్ణయించి అక్కడే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ఒక నూతన ఒరవడికి వైయస్ జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ దావులూరి లక్ష్మీ అంజయ్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూరా భాస్కర్ రావు, ఏఎంసి అధికారులు, సిబ్బంది, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# 'రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసన' : నరేంద్ర వర్మ



**బాపట్ల, ప్రజాపాలన :** బాపట్ల పట్టణం లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు లి నారా చంద్రబాబు నాయుడు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ ఏలూరి సాంబశివ రావు ఆదేశాలతో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు ఆధ్వర్యం లోలి రాష్ట్రము లో దళితులపై జరుగుతున్న అపరిమిత దాడులకు నిరసన గా బాపట్ల పట్టణం లోని పాత బస్టాండ్ వద్ద గల విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహం నుండి జమ్ములపాలెం ఫ్లై ఓవర్ వద్ద గల భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్ విగ్రహం వరకు లిదళిత ప్రతిఘటనలి కార్యక్రమం నిర్వహించి కాగడాలతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలవలన అధికారం లోకి వచ్చి వారినే అణగదొక్కుతున్న జగన్ మోహన్ రెడ్డి కి బుద్ది చెప్పే రోజులు దగ్గరే ఉన్నాయన్నారు. అధికారం లోకి వచ్చిన దగ్గర నుండి దాదాపుగా బలహీన వర్గాలపై 231 దాడులు 20 నెలలుగా అయ్యాయి అని వాటి పైన చర్యలే తీసుకోలేదని అన్నారు. 150 మంది దళితులమీద దమన కాండ జరిగితే కనీసం నోరెత్తి మాట్లాడలేని దాడులు చేసినవారిపై చర్యలు తీసుకునే పరిస్థితుల్లో కూడా లేని సిగ్గులేని ప్రభుత్వం రాష్ట్రం లో పనికిమాలిన పాలన అందిస్తుంది అన్నారు. 40 మంది మైనారిటీ ల మీద దాడులు జరిగితే ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేని దద్దమ్మ జగన్మోహన్ రెడ్డి అని దుయ్యబట్టారు. 300 మంది మహిళలను అత్యాచారం చేసిన వారిని కనీసం అరెస్ట్ చేయలేని అసమర్ధ ప్రభుత్వం రాష్ట్రం లో పాలిస్తుందని అన్నారు... ఈ దున్నపోతు ప్రభుత్వాన్ని ప్రజలంతా కలిసి నిలదీయాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా దోషులను శిక్షించాల్సిన ప్రభుత్వం దౌర్జన్యానికి గురి అయిన వారిని వేధిస్తోంది అనీ...ఈ సిగ్గు లేని ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ప్రజాలందరినీ మేల్కొలిపి నీ అసలు రంగు బయట పెడతామని అన్నారు.

బడుగు బలహీన వర్గాల వారికి అండగా ఉన్న వారి పైన అట్రాసిటీ కేసు లు పెడుతున్న దరిద్రపు దగాకోరు ప్రభుతానికి రోజులు దగ్గర వడ్డాయని అన్నారు. పులివెందుల మహిళ మీద గత నెల 28వ తేదీ న రేప్ చేసి న ఉదంతం పై న నిరసన వ్యక్తం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుల పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్న దుర్మార్గపు దాష్టిక పాలన లో మనమున్నామని అన్నారు. అదే విధం గా జగన్మోహన్ రెడ్డి కోసం కష్టపడి మోసపోయిన దళితులు, మైనారిటీ లు,బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన ప్రజలంతా జగన్మోహన్ రెడ్డి దాష్టిక దరిద్రపు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి వల్లం సరోజిని,బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు మొవ్వ శరత్, బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతిరావు,మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య,పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు వసుమర్తి యలమంద,పట్టణ తెలుగు యువత అధ్యక్షులు సలగల సురేష్, బాపట్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బడుగు యోహాను, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య,బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు దయాబాబు, బాపట్ల పట్టణ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు దగ్గుమల్లి కిరణ్,మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఆంధ్రేయ,పల్లం జీవన్,మద్దాల ముసలయ్య,దారా అశోక్, తదితర దళిత నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవానీ దీక్షల విరమణ మహెూత్సాలు ప్రారంభం



**విజయువాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** ఇంద్రకీలాద్రిపై ఉన్న విజయవాడ కనకదుర్గమ్మ భవానీ దీక్షల విరమణ మహెూత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ దీక్షల విరమణకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఏర్పాట్లు చేసింది. మహామండపం ఎదురుగా నిర్మించిన హోమగుండాల్లో మంగళవారం ఉదయం 6.50 గంటలకు ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పాలకమండలి చైర్మన్ పైలా సోమినాయుడు, ఆలయ కార్యనిర్వహణాధి కారి ఎం.వి.సురేష్ బాబు పాల్గొని అగ్ని ప్రతిష్ఠాపన చేసి, హోమగుండాలు వెలిగించారు. ఆలయ వేదికపై కమిటీ ఆధ్వర్యంలో పండితులు అగ్నిప్రతిష్ఠాపన చేయడంతో భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అగ్నిగుండాలతోపాటు ఇరుముడి సమర్పణకు 20 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ పైలా సోమినాయుడు, ఈవో సురేష్‌బాబు, ఆలయ స్థానాచార్యులు శివప్రసాదశర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు లింగంబొట్ల దుర్గాప్రసాద్, నేతికొప్పుల సుజాత, కత్తిక రాజ్యలక్ష్మి, కటకం శ్రీదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుడి ఆలయం నుంచి అమ్మవారి సన్నిధి వరకు క్యూ లైన్లలో భవానీలు ఎరుపురంగు వస్త్రాలతో తలపై ఇరుముడి పెట్టుకుని జై భవానీ నామస్మరణతో దుర్గమ్మను దర్శించుకునేందుకు బారులు తీరారు. రోజూ ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష విరమణ కోసం వచ్చే వారికి ఏర్పాట్లు చేశారు. రోజుకు 10వేల మందికి దర్శన అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్‌ను ముందస్తుగా బుక్ చేసుకున్న వారినే అనుమతిస్తున్నారు. కోవిడ్ నిబంధనల దష్ట్యా గిరి ప్రదక్షిణ, స్నానఘట్టాలలో స్నానాలు నిషేధించారు. ఆలయ పరిసరాల్లో కేశఖండనకు అవకాశం లేదు. పదేళ్లలోపు చిన్నారులు, 60 ఏళ్లు దాటిన వద్ధులు, వికలాంగులు, గర్భిణులకు దర్శనం నిషేధించారు. క్యూలైన్‌లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ భౌతికదూరం పాటించడంతోపాటు మాస్కు ధరించాలని దేవస్థానం సూచిస్తోంది. దర్శనం అనంతరం కొండ దిగువన మహామండపం వద్ద ఇరుముడి, హోమగుండాలను ఏర్పాటు చేశారు. దీక్షల విరమణ సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. భవానీ దీక్షా మహోత్సవాల సమయంలో సుమారు 2 లక్షల మంది భవానీలు దుర్గమ్మను దర్శించుకుంటారని అధికారులు అంచనా వేశారు. దర్శనం ఆనంతరం సాంబారు అన్నం, దద్దోజనాన్ని ప్యాకెట్ల రూపంలో ఉచితంగా పంపిణీ చేశారు.

# ఆస్తిపన్ను పెంపుదలను ఉపసంహరించుకోవాలి

## అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



**నరసరావుపేట, ప్రజాపాలన :** సిపిఐ కార్యాలయంలో ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను పెంపుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాసా రాంబాబు అధ్యక్షతన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది .ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టిడిపి నరసరావుపేట ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నివాస యేతర భవనాలు నివాస గృహాలకి చట్ట సవరణ చేసి ఏప్రిల్ ఒకటి నుండి ఆస్తిపన్ను పెంపుదల కీ జీవో నెంబర్ 196 197 198 తీసుకొచ్చిందని ఈ జీవోలను వెంటనే ఉపసంహరించుకో



వాలని అర్బన్ ప్రాంతంలో ప్రజలపై మరింత భారాన్ని మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను ప్రజల సంక్షేమం ద్యేయమని ప్రగల్భాలు పలుకుతూ ప్రజలపై భారాన్ని మెపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను నరసరావుపేట పట్టణ ప్రజల కోసం త్వరలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాం ఇంకా ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్ కె సిలార్ బి ఎస్ పి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట బుదాల బాబురావు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జాతీయ అధ్యక్షులు పునుగు పాటి పూర్ణచంద్రరావు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్, తెలుగు జిల్లా రైతు సంఘం నాయకులు గొట్టిపాటి జనార్ధన బాబు, జనసేన నాయకులు అధృఫ్, సిపిఐ కార్యదర్శి ఉప్పలపాడు రంగయ్య, ఏ ఐ టి యు సి కార్యదర్శి వైదన వెంకట్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మేకల సంపత్, ఏ ఐ వై ఎఫ్ కార్యదర్శి గుండాల హర్ష , కాసా రాంబాబు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్కయ్యల కుటుంబాల్లో సంతోషం నిండాలి : వంశీ



**గన్నవరం, జనవరి 5 (ప్రజాపాలన) :** అక్కయ్యల కళ్లలో ఆనందం కోసమే..ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా ఇవ్వడం జరుగుతోందని, వారి సొంతింటి కలను నెరవేర్చడం కోసం అవసరమైతే తానే ఇల్లు కట్టించి ఇస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ హామీఇచ్చారు. గన్నవరం మండలం ముస్తాబాదలో సూరంపల్లి, మాదలవారిగూడెం, సావరగూడెం, ముస్తాబాద గ్రామాలకు చెందిన 983 మందికి ఇళ్ల పట్టాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. వంశీ మాట్లాడుతూ అక్కయ్యలకు ఏ సమస్య వచ్చినా వంశీ అనే తమ్ముడు ఉన్నాడని గుర్తు పెట్టుకోవాలన్నారు. మీకు కష్టం వస్తే తనకు ఫోన్ చేయండీ..లేదంటే ఫోన్‌కు మెసేజ్ పెట్టండి..ఆ తర్వాత తాను మీ కష్టం తీర్చేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. దేవుడు సిఎం జగన్ రూపంలో వచ్చి పేదల గుండెల్లో నిలిచియేలా తనకు ఈ పట్టాలు పంచే అవకాశం కల్పించారని సంతోషించారు. ఆతర్వాత మహిళలు పలువురు తాము అనేక సార్లు స్థలం కోసం దరఖాస్తులు పెట్టినా రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దరఖాస్తులు స్వయంగా వంశీకి అందజేశారు. ఎమ్మెల్యే స్పందింస్తూ ఇంకా పట్టాలు రాని వారుంటే బాధ ప డొద్దని..మరో మూడు నెలల్లో మీకూ ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని హామీఇచ్చారు. ఈ ఏడాది పేద కుటుంబాల్లో సంతోషం నిండాలని ఆకాంక్షించారు. సూరంపల్లికి చెందిన ఓ యువతి మాట్లాడుతూ వంశీ అన్నయ్య చేసిన సాయం వల్లే ఉన్నత చదువులు చదివాననీ, పెళ్లైన ఏడేళ్ల తర్వాత మళ్లీ ఆయన చేతుల మీదుగా ఇంటి పట్టా తీసుకోవడంఎంతో ఆనందంగా ఉందని కళ్లు చెమర్చింది. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పార్టీ నాయకులు మేచినేని బాబు, శ్రీనివాస చౌదరి, ఎఇ రాణి, ఎండి.గౌసాని, ఎంపిడిఒ సుభాషిణి, తహశీల్దార్ సిహెచ్.నరసింహారావు పాల్గొన్నారు. మేచినేని బాబు ఆధ్వర్యంలో 3000 మందికి భోజనాలు పెట్టారు. ఆతర్వాత కేసరపల్లి పంచాయతీ పరిధిలో పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. పలువురికి వంశీ ఆర్ధిక సాయం అందించారు. పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాట్లు చేశారు.

# నూతన సిజెను కలిసిన కలెక్టర్



**విజయువాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ అరూప్ కుమార్ గోస్వామిని మంగళవారం కృష్ణాజిల్లా కలెక్టర్ ఎ.ఎండి. ఇంతియాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సిజెకు ఆయన మొక్కను అందించారు.

# రూరల్‌లో బలంగా ఫ్యాన్...

**కాకినాడ, జనవరి 5 (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ లో జగన్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఇరవై నెలలు గడుస్తుంది. ఇప్పటి వరకూ జగన్ సంక్షేమ పథకాల అమలుపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. అప్పులు తెచ్చి మరీ సంక్షేమ పథకాలకు కేటాయించడాన్ని కొందరు మేధావులు తప్పుపడుతున్నారు. సంపద సృష్టికి జగన్ నిధులు కేటాయించడం లేదని, కేవలం ఎన్నికల ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునేందుకే జగన్ ప్రయత్నాలు చేస్తున్నాయని సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా ఒక చర్చ మొదలయింది. జగన్ పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో దాదాపు 35 లక్షల మందికి లబ్ది చేకూరుస్తున్నారు. పదిహేను రోజుల పాటు పండగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గత ఎన్నికల్లో జగన్ పార్టీకి గ్రామీణం, పట్టణం అనే తేడా లేకుండా ఓటర్లు పట్టం కట్టారు. యాభై శాతానికి పైగానే ఓట్లను సాధించి 151 స్థానాలను సాధించారు. అయితే గత ఇరవై నెలలుగా జరుగుతున్న జగన్ పాలనపై అర్బన్ ప్రాంత ఓటర్లు అసంతృప్తిగా ఉన్నట్లు ఒక సర్వేలో వెల్లడయింది. గతంలో అర్బన్ ప్రాంతాల్లో టీడీపీ వీక్ గా ఉండేది. వైసీపీ బలంగా ఉంది. చంద్రబాబు పాలనతో విసిగిపోయిన విద్యావంతులు, విద్యర్థులు, ఉద్యోగ వర్గాలు, మేధావులు గత ఎన్నికల్లో జగన్ వైపు నిలిచారు. ఫలితంగా అర్బన్ ప్రాంతాల్లోనూ ఫ్యాన్ గాలి బలంగా వీచింది. కానీ ఈసారి రివర్స్ అయిందంటున్నారు. ఈ వర్గాలు జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల పెదవి విరుస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టి, ప్రజాధనాన్ని జగన్ వృధా చేస్తున్నారన్న విమర్శలు అర్బన్ ప్రాంతాల్లో బలంగా విన్పిస్తుంది. ఇక సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటంతో వైసీపీ నేటికి రూరల్ ప్రాంతంలో బలంగా ఉందంటున్నారు. వివిధ పథకాల అమలుతో పాటు రైతాంగం కూడా జగన్ పాలన పాట్ల సుముఖంగా ఉంది. తాను ఇచ్చిన హామీలను ఎన్నికలతో సంబంధం లేకుండా అమలు చేయడం వల్లనే రూరల్ ప్రాంతంలో జగన్ కు ఇప్పటికీ బలం చెక్కు చెదరకుండా ఉందంటున్నారు. అయితే రూరల్ ప్రాంతంలో టీడీపీకి కూడా పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. మొత్తం మీద జగన్ పాలనపై అర్బన్ ప్రాంతాల్లో మాత్రం కొంత వ్యతిరేకత మొదలయిందనే చెప్పాలి.

# జనవరి 1న 3లక్షలమంది జననాలు

**న్యూఢిల్లీ, జనవరి 5, (ప్రజాపాలన) :** నూతన సంవత్సరంలో జనవరి 1వ తేదీన భారత్‌లో మొత్తం 59,995 మంది వరకు చిన్నారులు జన్మించారని యునిసెఫ్ తెలిపింది. ప్రపంచంలో ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఈ సంఖ్య అధికమని తేలింది. గతేడాది.. అంటే 2020 జనవరి 1వ తేదీన ఇంతకన్నా 7,390 మంచి చిన్నారులు తక్కువగా జన్మించారు. ఇక ఈ జాబితాలో భారత్ ప్రథమ స్థానంలో ఉండగా, 35,615 శిశు జననాలతో చైనా రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో నైజీరియా (21,439), పాకిస్థాన్ (14,161), ఇండోనేషియా (12,336), ఇథియోపియా (12,006), అమెరికా (10,312), ఈజిప్ట్ (9,455), బంగ్లాదేశ్ (9,236), కాంగో (8,640) దేశాలు వరుస స్థానాల్లో నిలిచాయని యునిసెఫ్ తెలిపింది. కాగా ఈ ఏడాది జనవరి 1వ తేదీన మొత్తం కలిపి ప్రపంచ వ్యాప్తంగా 3,71,504 మంది చిన్నారులు జన్మించారని అంచనా వేస్తున్నట్లు యునిసెఫ్ తెలియజేసింది. ఇక జనవరి 1వ తేదీన చోటు చేసుకున్న మొత్తం శిశు జననాల్లో 52 శాతం జననాలు 10 దేశాల్లోనే సంభవించడం విశేషం. అయితే ఈ ఏడాది 14 కోట్ల మంది శిశువులు ప్రపంచ వ్యాప్తంగా జన్మించే అవకాశం ఉందని యునిసెఫ్ అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే కోవిడ్ 19 చిన్నారులకు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు గాను యునిసెఫ్ ఇటీవలే రీ ఇమాజిన్ పేరిట ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా చిన్నారుల తల్లిదండ్రులకు కోవిడ్‌పై అవగాహన కల్పిస్తారు.

# పార్టీ బలోపేతంపై జనసేనాని దృష్టి



**విజయవాడ, జనవరి 5, (ప్రజాపాలన) :** జనసేనాని ఓ విమర్శ చేస్తే అది..బుల్లెట్‌లా దూసుకెళుతుంది. ఎక్కడికెళ్లినా ఆయన సభ గ్రాండ్ సక్సెస్ అవుతుంది. పవన్ వస్తున్నారంటే.. జనసేన శ్రేణుల్లో ఓ జోష్ ఉంటుంది. కానీ ఆ జోష్ ఏడాది పొడవునా ఉండదు. ట్రెండ్ ఫాలో అవ్వను సెట్ చేస్తా అనే పవన్.. రెగ్యులర్ పార్టీల ట్రెండ్‌ను ఎప్పటికీ ఫాలో అవ్వరా. ఇదే ఇప్పుడు హాట్‌టాపిక్ అవుతోంది. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్? గతంలో చేసిన తప్పునే మళ్లీ చేస్తున్నారా? 2014 ఎన్నికలకు ముందు పార్టీని ప్రకటించిన పవన్.. ఆ ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ ? బీజేపీకి మద్దతిచ్చారు. 2019 ఎన్నికల నాటికి పార్టీ నిర్మాణం క్షేత్రస్థాయిలో జరుగుతుందని అంతా భావించారు. కానీ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకుండానే ఎన్నికలకు వెళ్లారు. ఒక్క సీటు తప్ప మిగతా అన్ని చోట్ల జనసేన ఘోరంగా ఓడిపోయింది. ఆ ఎన్నికల తర్వాత పార్టీ పునర్నిర్మాణం చేస్తానని ప్రకటించిన పవన్?మళ్లీ పాత పద్దతినే ఫాలో అయిపోతుండడంతో జనసేన శ్రేణులు, అభిమానులు కలవరపడుతున్నారట. ఏదేని పార్టీ బలంగా ఉండాలంటే సదరు పార్టీ నిర్మాణం బలంగా ఉండాలి. కార్యకర్తల సభ్యత్వం భారీ సంఖ్యలో ఉండాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలుండాలి. రాష్ట్ర స్థాయి కమిటీలు అటుంచితే..జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీల నిర్మాణమే ఇంతవరకు జరగలేదు. 13 జిల్లాలకు ఇంతవరకు పార్టీ అధ్యక్షులను ప్రకటించలేదు. కొన్ని నియోజకవర్గాలకు తప్ప చాలా నియోజకవర్గాలకు జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియామకం జరగలేదు. క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినా కొన్ని నియోజకవర్గాలకే పరిమితం అయ్యింది. ఇలా అయితే ఎలా అని పార్టీ అభిమానులూ ఆవేదన చెందుతున్నారట. ఏడాదిన్నర అయినా ఇప్పటికీ పార్టీ నిర్మాణ ప్రక్రియ మందకొడిగానే జరిగితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మాదిరే పవన్ పర్యటనలకు వెళ్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నారు. నివర్ తుపాను, వరదలతో నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించారు. నెల్లూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో బాధిత రైతులను పరామర్శించారు. ఇటీవల గుడివాడ సెంటర్‌కు పవన్ వెళితే జనం భారీగా వచ్చారు. మచిలీపట్నంలో చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. పవన్ ఎక్కడ పర్యటించినా అక్కడ పార్టీ శ్రేణుల కోలాహలం కనిపిస్తోంది. గత ఎన్నికలకు ముందు ఇంతకన్నా ఎక్కువగానే జనం వచ్చేవారు. కానీ జనం తరలివచ్చినంతగా ?ఓట్లు పోలవ్వలేదన్న సంగతిని గుర్తుంచుకోవాలిగా అనే సెటైర్లు వినిపిస్తున్నాయిప్పుడు. పవన్ నిరసనలు, పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టట్లేదనే విమర్శలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. క్యాడర్ ఉన్నా?నక్రమంగా నడిపించే నేతలే లేరనే టాక్ పార్టీ వర్గాల్లోనే నడుస్తోంది. ప్రజల్లోకి పార్టీ వెళ్లడంలో విఫలమవుతుందని భావిస్తున్నారు. రాజకీయ పార్టీ నిలదొక్కుకోవాలంటే నిరంతరం ప్రజలతో మమేకమవ్వాలి. అధినేత మాత్రమే కాదు.. ఆయా నియోజకవర్గాల్లో నేతలు సైతం ప్రజా సమస్యలపై పోరాడాలి. కానీ జనసేనాని వెళితే తప్ప స్థానికంగా సందడి కనపించట్లేదు. పవన్ వెళితే ఓ హైప్ క్రియేట్ అవుతుంది. ఆ సమయానికి స్థానిక కార్యకర్తలకు తాత్కాలిక బాధ్యతలు ఇస్తున్నారు. పార్టీలో క్రియాశీలకంగా నలుగురు నేతలు ముందుగా వెళ్లి పర్యటన ఏర్పాట్లు చూస్తున్నారు. పవన్ టూర్‌ని సక్సెస్ చేస్తున్నారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్‌లో లోకల్ లీడర్లు ఎవరన్నది పార్టీ క్యాడర్‌కే తెలియట్లేదు. దీంతో ఎవరి వెంట నడవాలో తెలియని అయోమయం నెలకొంది. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేనలో ఇలాంటి పరిస్థితే ఉండడంతో.. మార్పు ఇంకెప్పుడు వస్తుందో అని గుసగుసలాడుకుంటోందట క్యాడర్. పవన్ ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరుకు రెస్పాన్స్ బాగానే వస్తుందని భావిస్తున్నాయి పార్టీ వర్గాలు. అయితే ఈ స్పందన ఓట్ల రూపంగా మారతాయా అంటే డౌటే. అందుకే.. పార్టీ నిర్మాణం, బలోపేతం విషయంలో పవన్ కళ్యాణ్ దూకుడు పెంచాల్సిందేనని వాదన బలంగా వినిపిస్తోంది. లేకపోతే పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాన్ని.. జనసేనలోని కొందరు నేతలూ వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ...రెండోస్థానం కోసమే...

**విజయవాడ, జనవరి 5, (ప్రజాపాలన) :** తమ లక్ష్యం మొదటి స్థానం కాదు. రెండోస్థానమే. ప్రతిపక్ష హోదా దక్కించుకోవడమే. మూడు నెలల ముందు బీజేపీ సీనియర్ నేత రామ్ మాధవ్ చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇప్పుడు ఏపీలో బీజేపీ రెండోస్థానం కోసం ప్రయత్నిస్తుంది. అధికారంలో ఉన్న వైసీపీని ఎలాగూ బలహీనం చేయడం కష్టం కాబట్టి విపక్ష టీడీపీనే వీక్ చేయాలన్నది బీజేపీ లక్ష్యంగా కన్పిస్తుంది. ఇందుకు తిరుపతి ఉప ఎన్నికను బీజేపీ వేదికగా మలచుకోనుంది. ఇక్కడ పట్టు సాధిస్తే టీడీపీని వీక్ చేయడం పెద్దగా కష్టమేమీ కాదని బీజేపీ భావిస్తుంది. ఆ దిశగా అగ్రనాయకత్వం చర్యలు ప్రారంభించిందంటున్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లో కేంద్ర మంత్రులు విస్తృతంగా పర్యటించేలా ఒక రూట్ మ్యాప్ ను బీజేపీ తయారు చేసింది. ఏపీకి బీజేపీ అన్యాయంచేసిందని, విభజన హామీలను అమలు చేయలేదన్న అసంతృప్తి ఏపీలో ఉంది. దానిని తొలగించేందుకు బీజేపీ తొలుత ప్రయత్నం చేయనుంది. కేంద్ర మంత్రుల ద్వారా గత ఏడేళ్లలో ఆంధ్రప్రదేశ్ కు ఎన్ని నిధులు కేటాయించింది? వివరణాత్మకంగా ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించారు. ఇందుకు కేంద్రమంత్రులు నితిన్ గడ్కరి, నిర్మలా సీతారామన్, పియూష్ గోయల్ వంటి వారికి బాధ్యతలను అప్పగించారని చెబుతున్నారు. దీంతో పాటు జనసేన, బీజేపీ కలసి పోటీ చేస్తాయి కాబట్టి తిరుపతి ఉప ఎన్నికలో రెండోస్థానం రావడం పెద్ద కష్టమేదీ కాదన్నది బీజేపీ నేతల అభిప్రాయం. తెలంగాణలో కాంగ్రెస్ ను ఎలాగైతే వెనక్కు నెట్టామో? ఏపీలో టీడీపీని బలహీనపర్చే యత్నాలు బీజేపీ మొదలుపెట్టింది. తిరుపతి ఉప ఎన్నికలకు ముందే పెద్దయెత్తున చేరికలు ఉండేలా చూసుకోవాలని కేంద్ర నాయకత్వం నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో బీజేపీ రాష?ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నలుగురు ముఖ్యమైన నేతలకు ఈ బాధ్యతలను అప్పగించారు. ప్రధానంగా అసంతృప్తి ఉన్న టీడీపీ నేతలపై వీరు దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. తిరుపతి ఉప ఎన్నికలకు ముందే వీరిని బీజేపీలోకి చేర్చుకోవాలని నిర్ణయించారు. కొందరిపేర్లను అధినాయకత్వానికి పంపినట్లు తెలిసింది. అయితే చేరికలతో బీజేపీ బలోపేతమై, టీడీపీ బలహీనమవుతుందా? అంటే దానికి సమాధానం మాత్రం లేదు

# వైఎస్, ఎన్టీఆర్‌లను వదిలేశారా?

**గుంటూరు, జనవరి 5, (ప్రజాపాలన) :** సహజంగా పార్టీ వ్యవస్థాపకుల పేర్లు స్కీమ్ లకు పెడతారు. అలాగే మరణించిన తమ నేతల పేర్లను వివిధ పథకాలకు పెట్టి వారిని నిత్యం జనంలో ఉంచేలా పార్టీ అధినేతలు చర్యలు తీసుకుంటారు. కానీ ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రుల పేర్లతోనే ఎక్కువ పథకాలు నడుస్తున్నాయి. అటు చంద్రబాబు, ఇటు జగన్ ముఖ్యమంత్రిగా తమ హయాంలో తమ పేర్లు పథకాలను పెట్టుకోవడానికే ఇష్టపడుతున్నారు. ఇందుకు కారణాలేంటి? వైఎస్, ఎన్టీఆర్ లను వదిలేశారా? అంటే కాదు. దానికో బలమైన కారణముందంటున్నారు విశ్లేషకులు. తెలుగుదేశం పార్టీని నందమూరి తారకరామారావు స్థాపించారు. తర్వాత చంద్రబాబు చేతిలోకి టీడీపీ వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని పథకాలకు ఎన్టీఆర్ పేర్లనే పెట్టేవారు. తన పేరును ఎక్కడా వాడుకునే వారు కారు. కానీ 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఎక్కువ పథకాలకు చంద్రబాబు తన పేర్లనే పెట్టుకున్నారు. చంద్రన్న బీమా, చంద్రన్న సంక్రాంతి కానుక, చంద్రన్న క్రిస్మస్ కానుక వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎక్కువగా ప్రయత్నించారు. ఎన్టీఆర్ పేరును అతి తక్కువగా పథకాలకు వాడారన్న విమర్శలను చంద్రబాబు అప్పట్లో ఎదుర్కొన్నారు. జగన్ కూడా అదే బాటలో పయనిస్తున్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును పలు పథకాలకు పెట్టినా ప్రజల్లోకి వెళ్లే పథకాలకు మాత్రం జగన్ తన పేరునే పెట్టుకుంటున్నారు. జగనన్న చేయూత, జగనన్న ఇళ్ల పట్టాలు, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ఈ పదిహేను నెలల కాలంలో పెట్టుకున్నారు. నిజానికి జగన్ కు చిన్న వయసు. రాజకీయంగా ఇంకా ఎంతో భవిష్యత్ ఉంది. అయినా తనపేరుకే జగన్ ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఇందుకు జగన్, చంద్రబాబులను తప్పుపట్టలేం. ఎన్టీఆర్ ఇప్పటికే ఒక జనరేషన్ కు తెలియదు. వైఎస్ కూడా దాదాపు అంతే. వచ్చే ఎన్నికల నాటికి కొత్త ఓటర్లు లక్షల సంఖ్యలో రానున్నారు. వీరికి ఆ నేతల పేర్లు తెలియవు. అందుకే జగన్, చంద్రబాబులు తమ పేర్లతోనే జనంలోకి వెళితే కొంత ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. దివంగత నేతల పేర్లు పెట్టడానికి వీరిద్దరికి పెద్దగా అభ్యంతరం లేకపోయినా, ఎన్నికల్లో కొత్త జనరేషన్ కు గుర్తుండటానికే ఈ పథకాలకు తమ పేర్లను పెట్టుకుంటున్నారని ఒక సీనియర్ నేత విశ్లేషించారు.

# వ్యవసాయ శాఖ దిద్దుబాటు చర్యలు

**విజయవాడ, జనవరి 5, (ప్రజాపాలన) :** వినూత్నంగా నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారానికి లైసెన్స్‌లు లేకపోగా, ప్రస్తుతం లైసెన్స్‌ల జారీపై ప్రభుత్వం హడావిడి పడుతోంది. ఆర్‌బికెలకు సరఫరా చేసేందుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన హబ్‌ల (నిల్వ ప్రదేశాలు/గోడౌన్లు)కు తొలి దశలో లైసెన్స్‌లిచ్చేందుకు ఆదరాబాదరాగా చర్యలు ప్రారంభించింది. హబ్‌లు లైసెన్స్‌లు పొందేందుకు అవసరమైన అన్ని రకాల ధృవీకరణ పత్రాలనూ వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ జిల్లాలకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. దాంతో కింది స్థాయి అధికారులు లైసెన్స్‌ల కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైతే హబ్‌లకు మాత్రమే లైసెన్స్‌లిస్తున్నారు. గ్రామాల్లో బిజినెస్ చేసే ఆర్‌బికెల విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. చట్ట ప్రకారం ఆర్‌బికెలకు సైతం లైసెన్స్‌లు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. లైసెన్స్?లు లేకపోతే చట్ట వ్యతిరేక, జీరో బిజినెస్ అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఆర్‌బికెలలోని కియోస్క్‌లో ఆర్డర్ పెట్టిన వెంటనే సబ్సిడీ, నాన్?సబ్సిడీ ఫెర్టిలైజర్స్, సీడ్, పెస్టిసైడ్స్‌ను రైతు లకు అందించే ఏర్పాటు చేశారు. గవర్నమెంట్, ప్రైవేటు సంస్థల నుంచి ఉత్పాదకాలను సేకరించి హబ్‌లలో స్టోర్ చేసి, అక్కడి నుంచి ఆర్‌బికెలకు సరఫరా చేస్తున్నారు. తొలుత జిల్లాలో మూడు, నాలుగు హబ్‌లను పెట్టగా, మరింత వెసులుబాటు కోసం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) కేంద్రానికో హబ్ కింద వికేంద్రీకరించారు. ఇప్పటి వరకు ఆ హబ్‌లకు కానీ, ఆర్‌బికెలకుకాని లైసెన్స్‌లు లేవు. చట్ట ప్రకారం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారం చేసే ప్రభుత్వ సంస్థలకు, కో ఆపరేటివ్స్‌కు, ప్రైవేటు రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులకు, నిల్వ చేసే గోదాములకు లైసెన్స్‌లు తప్పనిసరి. కాగా హబ్‌లు, ఆర్‌బికెలు లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తున్నాయి. ఒక వేళ ఆర్‌బికెలలో నాణ్యతలేని, కల్తీ ఉత్పాదకాలు సరఫరా చేస్తే చట్ట ప్రకారం వ్యాపారం చేయలేదు కనుక రైతులకు నష్ట పరిహారం అందదు. ప్రైవేటు కంపెనీలు ఇలాంటి లసుగులతో పరిహారం ఎగ్గొట్టే అవకాశం ఉంటుంది. ఆ మేరకు రైతులకు నష్టం జరుగుతుంది. వ్యవసాయశాఖ దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ప్రభుత్వ రంగ, ప్రైవేటు కంపెనీలు తమ ఉత్పాదకాలపై రిటైల్, హోల్‌సేల్ డీలర్లకు ట్రేడ్ మార్జిన్ (కమిషన్) ఇస్తాయి. దాదాపు ఆరు మాసాలకు పైగా హబ్‌లు, ఆర్‌బికెలలో విత్తనా లు, ఎరువులు, పురుగు మందుల బిజినెస్ సాగుతోంది. రైతులకైతే కంపెనీలు నిర్ణయించిన ధరలకే ఉత్పాదకాలు అమ్మారు. వారికి ఎలాంటి డిస్కౌంట్లు ఇవ్వలేదు. మరలాంటప్పుడు కంపెనీలు డీలర్లకు ఇచ్చే కమిషన్ రూ.వందల కోట్లు ఏ ఖాతాలకు మళ్లాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ వ్యాపారానికైనా జిఎస్‌టి సర్కారుకు చెల్లించాలి. సీడ్ బిజినెస్‌పై జిఎస్‌టి లేదు. ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌పై జిఎస్‌టి ఉంది. ఈ వ్యవహారంపై సస్పెన్స్ కొనసాగుతోంది.

# ఎన్నికల కోసం కసరత్తు...

**నెల్లూరు, జనవరి 5, (ప్రజాపాలన) :** టీడీపీలో చిత్రమైన మంత్రాంగం నడుస్తోంది. పిల్లి కళ్లుమూసుకుని పాలుతాగిన చందంగా.. వ్యవహరిస్తున్నారట టీడీపీ తమ్ముళ్లు. పార్టీని డెవలప్ చేయాలని.. పార్టీలో అభివృద్ధిని చూసుకోవాలని.. ముందస్తుగా.. పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయాలని చంద్రబాబు తపిస్తున్నారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఎన్నికల సమయంలో జరిగిన లోటుపాట్లను సరిచేసుకుని ముందుకు సాగుతున్నారు. అందరికీ.. అన్నీ! అనే కాన్సెప్ట్‌తో పదవులు పందేరం చేశారు. కొత్త పోస్టులు సృష్టించి మరీ తమ్ముళ్లకు ఇచ్చారు. బీసీలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. ఒక రకంగా చెప్పాలంటే.. పార్టీని అభివృద్ధి చేసేందుకు ఎంత చేయాలో పార్టీ అధినేతగా చంద్రబాబు అన్నీ చేస్తున్నారు. మరి తమ్ముళ్లు ఏం చేస్తున్నారు? చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తున్నారా? లేక.. బాబు కళ్లకే గంతలు కడుతున్నారా? అంటే.. రెండోదే జరుగుతోందని అంటున్నారు పరిశీలకులు. ఎవరూ కూడా మనసు పెట్టి పనిచేయడం లేదు. ఎక్కడో గన్ని వీరాంజనేయులు, వేగేశ్న నరేంద్ర వర్మ, వెలగపూడి రామకృష్ణబాబు, ఏలూరి సాంబశివరావు వంటివారు మినహా.. రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్లు, మాజీ మంత్రులు, జూనియర్లు కూడా మనసు పెట్టడం లేదు. పైకి మాత్రం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు కనిపిస్తున్నారు. కానీ, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చాలా జిల్లాల్లో పార్టీ నేతలకు వ్యాపారాలు ఉన్నాయి. దీంతో ఎక్కడా ప్రభుత్వంపై తాడో పేడో తేల్చుకునే రేంజ్‌లో మాత్రం పనిచేయడం లేదు. క్షేత్ర స్థాయిలో పార్టీ తరపున పోరాటాలు చేసే టీడీపీ నేతలను ఇప్పుడున్న పరిస్థితుల్లో వేళ్ల మీద లెక్క పెట్టేయొచ్చు. ఇక, పార్టీ ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులుగా ఉన్న వారికి చంద్రబాబు కీలక కాన్సెప్ట్ అప్పగించారు. పార్టీ తరఫున వాయిస్ వినిపించాలని ఆదేశించారు. అంటే.. రోజూ మీడియాలో వీరి పేర్లు రావాలి. ఆదివారం, పండగ అనే అంశాలను పక్కనపెట్టి మరీ పార్టీ కోసం పనిచేయాలని చంద్రబాబు సూచించారు. అయితే.. వీరు కూడా అదే పనిగా తప్పించుకుంటున్నారు. ఇటీవల విజయవాడ, విశాఖ, అనంతపురం జిల్లాల్లో జరిగిన ఘటనలు వీరు ఎంత నాణ్య మైన సేవలు అందిస్తున్నారో స్పష్ట మవుతోందని అంటున్నారు పరిశీలకులు. ఓ స్టేట్‌మెంట్‌ను ఆన్‌లైన్‌లో మీడియాకు ఇచ్చేసి చేతులు దులుపుకొంటున్నారు. కొన్ని చోట్ల కార్యక్రమాలకు హాజరు కాకుండానే హాజరైనట్టు పేర్లు రాయించుకుంటు న్నారు. మరికొన్ని చోట్ల నిర్వహిం చని కార్యక్రమాలకు కూడా నిర్వహించినట్టు కలరింగ్ ఇస్తున్నారు. మొత్తంగా వీరు చంద్రబాబు దగ్గర మాత్రం 'మేం పనిచేస్తున్నాం సార్' అనే అటెండెన్సును మాత్రం వేయించుకుంటున్నారు. దీనివల్ల వారికి ఎలాంటి ప్రయోజనమో తెలియదు కానీ.. పార్టీ మాత్రం దెబ్బతినడం ఖాయం అని అంటున్నారు పరిశీలకులు.



## జూనియర్ ఎన్టీఆర్ కొత్త బాధ్యత.. వారికిక బ్రాండ్ అంబాసిడర్




టాలీవుడ్ అగ్ర నటుల్లో ఒకరైన జూనియర్ ఎన్టీఆర్ అలియాస్ తారక్ కొత్త అవతారం ఎత్తారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న ఆన్ లైన్ మోసాలకు చెక్ చెప్పేందుకు.. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వీలుగా కొత్త బాధ్యతకు ఓకే చెప్పారు. తెలంగాణ పోలీసులకు ప్రచార కర్తగా ఆయన వ్యవహరించనున్నారు. ఫేస్ బుక్ లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి అమ్మాయిల్ని బురిడీ కొట్టించి.. ఫోన్ నెంబర్లు తీసుకొని వేధించే వారికి చెక్ పెట్టేలా.. అలాంటి వారి దుర్మార్గాలపై అమ్మాయిల్లో అవగాహన పెంచేందుకు వీలుగా తారక్ ప్రచారం చేయనున్నారు. 'ఫోన్ నెంబరు తీసుకుంటారు. ప్రేమ పేరుతో వల వేస్తారు. అభ్యంతరకర ఫోటోలు వాట్సాప్ లలో తెప్పించుకొని బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నారు. ఇలాంటి ముఠాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అంటూ తెలంగాణ పోలీసులు రూపొందించిన వీడియోను జూనియర్ ప్రమోట్ చేశారు. ఫేస్ బుక్ ఫ్రెండ్ రిక్వెస్టు మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరుతున్నారు. ఒకవేళ ఎవరైనా బాధితులుగా మారితే ధైర్యంగా పోలీసులకు కంప్లైంట్ చేయాలని.. వారు అండగా నిలుస్తారంటూ పోలీసుల తరఫున అవగాహన కల్పిస్తున్నారు. ఆన్ లైన్ మోసాలకు చెక్ చెప్పేందుకు.. మహిళల్లో అవగాహన కల్పించేందుకు తారక్ ను తెలంగాణ పోలీసులు సీన్లోకి తీసుకురావటం వల్ల మేలు జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## కెమెరామెన్‌గా అల్లు అర్జున్.. ఏం క్యాప్చర్ చేశాడో చూడండి!



మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే.. ఆకాశాన హరివిల్లు విరిస్తే.. అవన్నీ తమకోసమే అని సంబరపడతారు చిన్నారులు. ఆ సమయంలో వారి కళ్లలో కోటి కాంతులు విరజిమ్ముతాయి. ముఖంలో మిలియన్ల మెరుపులు విరబూస్తాయి. మరి ఆ పిల్లలు తనవాళ్లే అయినప్పుడు ఓ తండ్రి అనుభూతి ఇంకెంత మధురంగా ఉంటుంది? అలాంటి.. సిచుయేషన్స్ ను ఎల్లకాలం పదిలంగా దాచుకునేందుకు కెమెరాతో క్యాప్చర్ చేస్తుంటారు ఈ తరం ఫాదర్స్. తాజాగా.. అల్లు అర్జున్ కూడా అదే చేశారు. వాస్తవానికి స్టయిలిష్ స్టార్ తన టైనీ టాట్స్ గురించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో కబుర్లు చెబుతూనే ఉంటాడు. తనవైఫ్ స్నేహ కూడా అభిమానులతో సంతోషాలను షేర్ చేసుకుంటూనే ఉంటారు. ఇప్పుడు క్యూట్ చిల్డ్రన్ కోసం ఫోటో గ్రాఫర్ గా మారాడు స్టయిలిష్ స్టార్. తన పిల్లలు అర్హా అయాన్ తోపాటు మరో చిన్నారి కెమెరాకు స్పెషల్ ఫోజ్ ఇవ్వడంతో.. దాన్ని భద్రంగా క్యాప్చర్ చేశాడు బన్నీ. ఇందులో బన్నీ బేబీ క్వీన్ అర్హా ఇచ్చిన స్వీట్ స్మైల్ విత్ ఎక్స్ ప్రెషన్ ఎంత క్యూట్ గా ఉందో..! ఈ ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు స్టయిలిష్ స్టార్. ఫ్యాన్స్ ఈ ఫొటోకు షూట్ చేస్తున్న బన్నీకి లైకుల వర్షం కురిపిస్తున్నారు.

## కో అంటే కోటీ.. కాసుల గలగలే.. రష్మిక ఆదాయం ఎంతో తెలుసా?



దీపంలో నూనె చూసి అది ఎంతసేపటి వరకు వెలుగునిస్తుందో అంచనా వేయొచ్చు. కానీ.. సిల్వర్ స్క్రీన్ పై తారల వెలుగు చూసి వారు ఎంతకాలం ప్రకాశిస్తారో చెప్పలేం. ఓవర్ నైట్లో స్టార్ అయిపోగలరు.. ఒక్కసినిమాతో 'తెర'మరుగై పోనూగలరు. అందుకే.. వెలుగుతున్నప్పుడే అందరినీ వాడేస్తుంటారు సినీతారలు. ఇప్పుడు కన్నడ బ్యూటీ రష్మిక మందన్న కూడా అదే పనిచేస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ ఎవరు అంటే వినిపించే పేర్లలో ముందు వరసలో ఉంటుంది రష్మిక మందన్న. కొంతకాలంగా సీనియర్ నటీమణుల హవా తగ్గడంతో.. ఈ బ్యూటీ రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇతర హీరోయిన్స్ పోటీ ఇస్తున్నప్పటికీ.. ఈ అమ్మడు ఏ మాత్రం తగ్గడం లేదు. ఇక ఆదాయం విషయంలోనైతే ఈ నాలుగేళ్లలో రష్మిక ఎక్కడికో వెళ్లిపోయింది.

**చేసిందల్లా హిట్టే..**

కన్నడ ఇండస్ట్రీలో ఒక హిట్టు అందుకుందో లేదో టాలీవుడ్ దర్శక నిర్మాతలను ఆకర్షించింది ఈ బ్యూటీ. 'ఛలో' సినిమాతో సింపుల్ ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. ఆ తరువాత వరుసగా అవకాశాలను అందుకుంటూ వచ్చింది. మధ్యమధ్యలో ఒకటీ అరా ఫ్లాప్స్ ఎదురైనప్పటికీ.. మెజారిటీగా చేసిన ప్రతీ సినిమా హిట్టే అన్నట్టుగా మారిపోయింది కన్నడ బ్యూటీ ఫేట్.

**ఇంతింతై..**

ఇక రష్మిక మందన్న ఆదాయం విషయానికి వస్తే ఈ బ్యూటీ ఒక సినిమాకు రూ.2కోట్లకు తక్కువ తీసుకోవడం లేదని టాక్. గత ఏడాది సరిలేరు నీకెవ్వరు భీష్మ సినిమాలు కమర్షియల్ హిట్ గా నిలవడంతో సౌత్ లో ఈ అమ్మడి డిమాండ్ పెరిగింది. రెమ్యునరేషన్ విషయంలో ఏ మాత్రం తగ్గకుండా.. ఇంతింతై అన్నట్టుగా పెంచుకుంటూ వెళ్తోంది.

**కోట్ల రూపాయల ఆదాయం..**

2016లో రష్మిక సంపాదన రూ.3కోట్లు మాత్రమేనని అంచనా. అంతకుముందు రూ.లక్షల్లోనే రెమ్యునరేషన్ అందుకునేది. వరుసగా బాక్సాఫీస్ హిట్స్ పడడంతో ఆమె ఆదాయం కూడా పెరుగుతూ వస్తోంది. 2017లో రూ.7కోట్లకు పెరిగిన ఆమె ఇన్ కమ్.. 2018లో రూ.9.50కోట్లకు చేరింది. ఆ తర్వాత రెమ్యునరేషన్ మరో స్థాయికి వెళ్లడంతో 2019లో రష్మిక ఆదాయం రూ.16కోట్లకు దగ్గరైందని టాక్.

**యాడ్స్ ద్వారా కూడా..**

కేవలం సినిమాల ద్వారానే కాకుండా.. ఇతర యాడ్స్ ద్వారా కూడా బాగానే ఆర్జిస్తోంది ఈ కన్నడ బ్యూటీ. 2020 చివరి నాటికి మొత్తం ఆదాయం రూ.25కోట్లకు చేరిందని సమాచారం. ప్రస్తుతం అల్లు అర్జున్ తో ఈ భామ.. 'పుష్ప' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ.. పాన్ ఇండియా లెవల్లో విడుదల కానుంది. బాలీవుడ్ లో కూడా ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఈ బ్యూటీ. ఈ ప్రాజెక్టులు గనక హిట్టయితే రష్మిక రెమ్యునరేషన్ మరో స్థాయికి చేరుతుందనడంలో సందేహం లేదు.

## మెగాస్టార్ పక్కన ఆ పాత్రలో అంటే నయనతార ఓకే అంటుందా..?



2019లో మోహన్లాల్ నటించిన బ్లాక్బస్టర్ మలయాళం మూవీ 'లూసిఫర్'. తెలుగులో ఈ సినిమా మెగాస్టార్ చిరంజీవి హీరోగా రీమేక్ కానుంది. ఇప్పటికే డైరెక్టర్ మోహన్ రాజా ఈ సినిమా బాధ్యతలను స్వీకరించి స్క్రిప్ట్ పనులలో ఉన్నాడు. తాజా సమాచారం ప్రకారం.. లూసిఫర్ తెలుగు వెర్షన్ స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయట. హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించిన ఒరిజినల్ 'లూసిఫర్' రీమేక్ హక్కులను మెగాపవర్ స్టార్ రామ్చరణ్ సొంతం చేసుకున్నాడు. ఇక కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్ పై లూసిఫర్ మూవీని నిర్మించనున్నాడు. లూసిఫర్ మలయాళంతో పాటు తెలుగులో డబ్ అయి విడుదలైంది కానీ ప్రేక్షకుల వరకు చేరుకోలేక పోయింది. అయినా హీరో పాత్రను మోహన్లాల్ చేసిన విధానం బ్రిలియంట్ డైరెక్షన్ క్రిటిక్స్ను బాగా మెప్పించాయి. అందుకే మలయాళంలో 'లూసిఫర్' బ్లాక్ బస్టర్ హిట్ అయింది. స్టార్ యాక్టర్ మోహన్ లాల్ నటించిన క్యారెక్టర్ చిరంజీవికి బాగా నచ్చి ఆ పాత్రలో నటించాలని ఉత్సాహంగా ఉన్నాడు. తాజా సమాచారం ప్రకారం.. ఒరిజినల్ లూసిఫర్ లో నటి మంజు వారియర్ పాత్ర కూడా కీలకమైనది. అయితే తెలుగు వర్షన్ కోసం ఆ పాత్రలో లేడీ సూపర్ స్టార్ నయనతార నటించబోతున్నట్లు ఇండస్ట్రీలో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలో నిజం ఎంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే. మెగాస్టార్ నయనతారలు ఆల్రెడీ సైరా సినిమాలో భార్యభర్తలుగా నటించారు. మరి చూడాలి నయనతార నుండి ఎలాంటి సమాధానం రానుందో.. ఇక మెగా అభిమానులు మెగాస్టార్ ను 'లూసిఫర్' రీమేక్ లో చూసేందుకు చాలా ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. మెగాస్టార్ ప్రస్తుతం ఆచార్య సినిమా చేస్తున్నాడు. అటు నయనతార విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తోంది.

## వకీల్ సాబ్ టీజర్.. రికార్డులన్నీ బ్రేక్ చేస్తుందా?

సోషల్ మీడియా.. డిజిటల్ యుగంలో ప్రచారం పరంగా పోటీ అనేది విభిన్నంగా ఉంది. యూట్యూబ్ సహా ఇన్ స్టా.. ట్విట్టర్ వంటి చోట్ల దూసుకెళ్లడం స్టార్లకు ఇంపార్టెంట్ గా మారడంతో ఈ వేదికపై పోటీ రచ్చకు తెర లేపుతోంది. స్టార్ హీరోల సినిమాలు రిలీజవుతున్నాయి అంటే వాటికి సంబంధించిన ప్రమోషనల్ మెటీరియల్ ని వైరల్ చేసేందుకు ఫ్యాన్స్ అంతే పోటీపడుతున్నారు. ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కల్యాన్ కంబ్యాక్ మూవీ వకీల్ సాబ్ ని బ్లాక్ బస్టర్ చేయాలన్న పంతం ఫ్యాన్స్ లో కనిపిస్తోంది. ఈ మూవీకి సంబంధించిన ఎలాంటి ప్రకటన వెలువడినా సోషల్ మీడియాల్లో అది వేగంగా వైరల్ అవుతోంది. పవన్ కంబ్యాక్ పెద్ద రేంజులో ఉండాలని రికార్డుల పరంగా సంచలనాలు సృష్టించాలని పవన్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇదే సమయంలో వకీల్ సాబ్ నుంచి టీజర్ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ టీజర్ అంతర్జాలంలో సరికొత్త రికార్డులు నెలకొల్పడం ఖాయంగానే కనిపిస్తోంది. పవన్ నటించిన అజ్ఞాతవాసి రిలీజై చాలా కాలం అవ్వడంతో ఫ్యాన్స్ ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వకీల్ సాబ్ టీజర్ పై భారీ అంచనాలే ఏర్పడ్డాయి. మోస్ట్ అవైటెడ్ టీజర్ పాత రికార్డులను బ్రేక్ చేస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాల్లో పవన్ ఫ్యాన్స్ రచ్చ మామూలుగా లేదు. ఇతర స్టార్లతో పోలికలు పెడుతూ తమ ఫేవరెట్ హీరో రికార్డుల్ని మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ పింక్ రీమేక్ గా వకీల్ సాబ్ తెరకెక్కుతోంది. ఇందులో శృతిహాసన్ కథానాయికగా నటిస్తుండగా.. నివేతా థామస్.. అంజలీలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని దిల్ రాజు - బోనికపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




## స్టైలింగ్ లో స్టైలిష్ స్టార్ నే ఫాలో చేస్తున్నాడా?



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఏం చేసినా దానిని అనుసరించేందుకు లక్షలాదిగా ఫాలోవర్స్ ఉన్నారు. బన్ని అభిమానులే కాదు సెలబ్రిటీల్లోనూ తన స్టైలింగ్ ని అనుకరించాలని ఆరాటపడే వాళ్లు లేకపోలేదు. కాస్ట్యూమ్స్.. హెయిర్ కట్ .. బాడీ షేపింగ్ వగైరా వగైరా విషయాల్లో బన్ని ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలిచాడు. ఇక అతడి డ్యాన్సులకు ప్రపంచవ్యాప్తంగా వీరాభిమానులున్నారు. ఆ స్టెప్పుల్ని ఇమ్మిటేట్ చేసేవాళ్లున్నారు. ఇకపోతే స్టైలింగ్ విషయంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ని ఫాలో అవుతున్న హీరోల జాబితాలో ఇప్పుడు రామ్ పోతినేని పేరు వినిపిస్తోంది. ఈ టాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో తనకంటూ ఓ స్టైల్ ని క్రియేట్ చేసుకుని యువతరంలో భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న సంగతి తెలిసినదే. టాలీవుడ్ లోనే అల్ట్రా స్మార్ట్ హీరోగా అతడికి గాళ్స్ లో ఇమేజ్ ఉంది. ఇకపోతే ఇటీవల రామ్ సింహం బొమ్మ లోగో ఉన్న స్టైలిష్ షర్ట్ తొడుక్కోవడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. బన్నీని రామ్ ఫాలో చేస్తున్నారా? అంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఇక ఇటీవల అల్లు అర్జున్ ఎక్కడ చూసినా సింహం బొమ్మ లోగో ఉన్న షర్ట్స్ మాత్రమే వేసుకుంటున్నాడు. నిహారిక వెడ్డింగ్ లో స్టైలిష్ స్టార్ ఈ బ్రాండ్ షర్ట్స్ వేసుకున్న ఫొటోలు బైటకు వచ్చాయి. అయితే ట్రెండ్ కి తగ్గట్లుగా స్టైలిష్ గా ఉండే స్టార్ హీరో బన్నీని మిగతా కుర్ర హీరోలు కూడా ఫాలో అవుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో రామ్ మీద తాజాగా జరిగిన ఫొటో షూట్ ఈ బ్రాండ్ షర్టింగ్స్ లో కనిపించారు. అది కేవలం ఎంపిక చేసుకున్న బ్రాండ్ వల్లనే అలా అంతా భావించారనుకోవచ్చు. ఇక బన్ని.. రామ్ ఎవరికి వారు ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్ పరంగా డ్యాన్సుల పరంగా యూనిక్ స్టైల్ తో నవతరాన్ని అలరిస్తుంటారన్న సంగతి తెలిసినదే. రేసు గుర్రం ఒకరు అయితే ఇస్మార్ట్ శంకర్ ఇంకొకరు అన్నమాట.

## ఫిబ్రవరిలో నయన్ పెళ్లి ఫిక్స్!



స్టార్ హీరోయిన్ నయనతార -దర్శకుడు విఘ్నేష్ తమ లివింగ్ రిలేషన్ షిప్ ను వివాహ బంధంగా మార్చుకోబోతున్నారన్న వార్త చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. డిసెంబర్ చివర్లోనే ఒక్కటి కాబోతు న్నారని ప్రచారం జరిగింది. ఇప్పుడు అందుతున్న లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. ఫిబ్రవరిలో వారిద్దరూ కొత్త జీవితంలోకి అడుగు పెట్టబోతున్నారని తెలుస్తోంది. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్-నయనతార చాలా కాలంగా డేటింగ్ చేస్తున్నారు. దాదాపు ఐదేళ్ల నుంచి వీరి సహజీవనం కొనసాగుతోంది. ఈ క్రమంలో వారి వివాహం గురించి గతంలో చాలాసార్లు వార్తలు వచ్చాయి. కానీ.. అవి నిజం కాలేదు. అయితే.. కోలీవుడ్ మీడియా ప్రకారం విఘ్నేష్-నయన్ ఈ ఫిబ్రవరిలోనే వివాహం చేసుకోవాలని యోచిస్తున్నా రట. ఈ పెళ్లి హిందూ క్రైస్తవ సాంప్రదా యాల ప్రకారం జరుగుతుందని తెలుస్తోంది. కాగా.. ఈ వేడుక భారీగా నిర్వహించట్లేదట. కేవలం పరిమిత సంఖ్యలో బంధుమిత్రుల ను తమ వివా హానికి ఆహ్వానిస్తారని సమా చారం. వీరి వివాహం త్వరగా జరగాలని ఇద్దరి తల్లిదండ్రులు కోరుకుంటున్నారని అందుకే వీరు త్వరగా పెళ్లి పీటలు ఎక్కబోతున్నా రని సమాచారం. త్వరలోనే నయన్-విఘ్నేష్ కలిసి ఓ ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందని కోలీవుడ్ మీడియా కోడై కూస్తోంది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com